ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక


సంపుటి - 02 సంచిక -305 పేజీలు - 08 వెల - 04/- శుక్రవారం19 సెప్టెంబర్ 2025

# జీఎస్టీ సంస్కరణలతో అభివృద్ధి వేగం

## అసెంబ్లీలో సిఎం చంద్రబాబునాయుడు

### జిఎస్టీ సంస్కరణలు స్వాగతీస్తూ అసెంబ్లీ తీర్మానం

**140 కోట్ల మందికి మేలు జరుగుతుంది -ఇలాంటి సాహసం కేవలం మోడీకే సాధ్యం**



అమరావతి **సెప్టెంబర్ 18 ఆంధ్ర ప్రగతి :** జీఎస్టీ 2.0 సంస్కరణలను స్వాగతిస్తూ ఏపీ అసెంబ్లీ తీర్మానం చేసింది. ఇది పేదలకు పెద్ద ఊరట కలిగించే అంశంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దేశంలో తొలిసారిగా జీఎస్టీ 2.0 సంస్కరణలపై ఏపీ శాసనసభ తీర్మానం చేసిందని తెలిపారు. జీఎస్టీ 2.0 కొత్త శ్లాబుల వల్ల జరిగే ప్రయోజనాల గురించి శాసనసభ ద్వారా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. తన రాజకీయ జీవితంలో మొదటిసారి ఇలాంటి జీఎస్టీ సవరణలు చూశానని చెప్పుకొచ్చారు. గతంలో డబ్బులు లేనప్పుడు ట్యాక్స్ వేసేవారని.. దీంతో ప్రజలు ఇబ్బందులు పడేవారని తెలిపారు. ఆర్థిక సంస్కరణలు, టెక్నాలజీ, సవరణలను అమలు చేయడానికి తాను ముందు ఉంటానని ఉద్ఘాటించారు. ఎవరైతే సంపద సృష్టించలేరో వారికి సంక్షేమం ఇచ్చే అర్హత లేదని చమత్కరించారు. జీఎస్టీ స్లాబ్‌లలో మార్పు వస్తే ఇబ్బందులు వస్తాయని.. ఆదాయం తగ్గుతుందని ఆర్థిక శాఖ అధికారులు తనకు మొదట చెప్పారని గుర్తుచేశారు. అయితే వారితో దేశమే తొలి ప్రాధాన్యమని .. దాని తర్వాతే ఆదాయమని తాను చెప్పానని అన్నారు. ముందు ఏపీ నుంచి అధికారులు వెళ్లి జీఎస్టీ 2.0 సంస్కరణలకు మద్దతు ఇవ్వాలని ఆదేశించినట్లు- చెప్పారు. మిగతాది 2లో...



2లో.

## జిఎస్టీ సంస్కరణలకు ఎపి తొలి మద్దతు

**ప్రజలకు మేలు కలిగించాలన్నదే లక్ష్యం**

**సంస్కరణలతో ప్రజల ఆదాయం మెరుగవుతుంది**

**శాసనభలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్**




# ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు

**ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు**

**ఇతర రాష్ట్రాల ఫోన్లు ఉపయోగింపు**

**ఒక రాష్ట్రం తరవాత మరో రాష్ట్రం**

**పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాహుల్ వివరణ**

న్యూఢిల్లీ **సెప్టెంబర్ 18 ఆంధ్ర ప్రగతి :** కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న ప్రాంతాల నుంచి ఓట్లను తొలగించారని విమర్శించారు. రాష్ట్రం వెలుపలి నుంచి నకిలీ లాగిన్లు, ఫోన్ నంబర్లను ఉపయోగించి ఓటర్ ఐడీలను తొలగించినట్లు వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి కేంద్రీకృత పద్ధతిలో ఈ చర్యలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఈ మేరకు దిల్లీలో మీడియా సమావేశంలో ఆరోపణలు చేశారు. ఓట్ల తొలగింపు అంతామిగతాది 2లో...

# మండలి నుంచి వైసీపీ వాకౌట్...

**మంత్రుల తీరుపై బొత్స ఫైర్**

**మంత్రుల సమాధానాలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయన్న బొత్స**

**మంత్రి ఆనం తీరుపై తీవ్ర అసంతృప్తి**

**మంత్రి పదవికి ఆనం రాజీనామా చేయాలని డిమాండ్**



అమరావతి **సెప్టెంబర్ 18 ఆంధ్ర ప్రగతి :** ఏపీ శాసనమండలిలో మంత్రులు ఇస్తున్న సమాధానాలు అత్యంత బాధ్యతారహితంగా ఉన్నాయని ఆరోపిస్తూ వైసీపీ ఎమ్మెల్సీలు సభ నుంచి వాకౌట్ చేశారు. ముఖ్యంగా దేవాలయాల భద్రతకు సంబంధించిన ప్రశ్నకు మంత్రి వ్యంగ్యంగా బదులిచ్చారని,మిగతాది 2లో...

# కరేడు భూములు బలవంతంగా లాక్కోవడంలేదు

**ఇండోసోల్ పరిశ్రమ భూసేకరణపై మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరణ**

**రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకోవడం లేదని స్పష్టీకరణ**

**ఎకరాకు రూ. 20 లక్షల పరిహారం పెంచడంతో రైతుల అంగీకారం**

**స్వచ్ఛందంగానే భూములు ఇచ్చేందుకు**



2లో.

# ఎపి లిక్కర్ స్కామ్ కేసులో ఇడి దాడులు

**ఏకకాలంలో 20 చోట్ల పెద్ద ఎత్తున తనిఖీలు**

**సిట్నివేదిక ఆధారంగా రంగంలోకి దిగిన ఇడి**




అమరావతి **సెప్టెంబర్ 18 ఆంధ్ర ప్రగతి :** రూ. 3,500 కోట్ల విలువైన ఏపీ లిక్కర్ స్కామ్ అంశంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, దిల్లీలో ఈడీ తనిఖీలు చేపట్టింది. మద్యం కుంభకోణం కేసులో నిందితుల సంస్థలు, కార్యాలయాల్లో అధికారులు సోదాలు చేశారు. 5 రాష్ట్రాల్లోని 20 ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. మరోవైపు ఏపీ మద్యం కుంభకోణం కేసులో సిట్ ఇప్పటివరకూ 29 మంది వ్యక్తులు, 19 సంస్థలను నిందితులుగా చేర్చింది. 12 మందిని అరెస్టు చేసింది. మిగతాది 2లో...

# అసెంబ్లీ 8 రోజులే



అమరావతి **సెప్టెంబర్ 18 ఆంధ్ర ప్రగతి :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ పనిదినాలను 8 రోజులకు కుదించారు. దీంతో ఈనెల 27 వరకు సమావేశాలు జరగనున్నాయి. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు 10 రోజుల పాటు- నిర్వహించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడి అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో తొలుత నిర్ణయించారు. కానీ, ఆ తర్వాత 8 రోజులకు కుదించారు. రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సభ జరగనుంది. సభలో చర్చించేందుకు 18 అంశాలను తెదేపా, 9 అంశాలను భాజపా ప్రతిపాదించింది. ప్రశ్నోత్తరాలతో పాటు- జీరో అవర్‌లోనూ మంత్రులు ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

# స్థలాలను వెనక్కి తీసుకునే అధికారం ఎవరిచ్చారు ?

**పేదల ఇళ్ల పట్టాల రద్దు చేస్తున్నారంటూ వైఎస్ జగన్ తీవ్ర విమర్శలు**





అమరావతి **సెప్టెంబర్ 18 ఆంధ్ర ప్రగతి :** ప్రభుత్వం పేదలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, గతంలో తాము పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల పట్టాలను రద్దు చేస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పేదల సొంతింటి కలను నాశనం చేయడానికే చంద్రబాబుకు ప్రజలు అధికారం ఇచ్చారా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇది పేదలకు ఇచ్చే ప్రభుత్వం కాదని, వారికి ఉన్నవాటిని లాక్కునే 'రద్దుల ప్రభుత్వం' మిగతాది 2లో...

# దేవాలయాల బోర్డులకు కొత్త ఛైర్మన్లు !

**టీటీడీ సలహా కమిటీలకు కొత్త అధ్యక్షులు**

**ఉత్తర్వులు జారీ చేసిన కూటమి ప్రభుత్వం**





అమరావతి **సెప్టెంబర్ 18 ఆంధ్ర ప్రగతి :** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కీలక నియామకాలు చేపట్టింది. రాష్ట్రంలోని పలు ప్రముఖ దేవాలయాల పాలకమండళ్లకు కొత్త ఛైర్మన్లను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నడిచే వివిధ నగరాల్లోని స్థానిక సలహా కమిటీలకు (లోకల్ అడ్వైజరీ కమిటీ) కూడా కొత్త అధ్యక్షులను నియమించింది. మిగతాది 2లో...

# దసరా ప్రయాణికులకు శుభవార్త

**7,754 స్పెషల్ బస్సులను నడపనున్న ఆర్టీసి**




హైదరాబాద్, **సెప్టెంబర్ 18 ఆంధ్ర ప్రగతి :** దసరా, బతుకమ్మ పండుగల సీజన్ సమీపిస్తుండటంతో, సొంత గ్రామాలకు వెళ్లే ప్రయాణికుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు సర్వీసులను నడపాలని నిర్ణయించింది. మిగతాది 2లో...

# సిఎంతో బ్రిటిష్ హైకమిషనర్ లిండీ భేటీ

**తెలంగాణ విద్యార్థులకు సహకారం ఇస్తామని హామీ**



హైదరాబాద్ **సెప్టెంబర్ 18 ఆంధ్ర ప్రగతి :** భారత బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం జూబ్లీహిల్స్ నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యూకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే చెవెనింగ్ స్కాలర్ షిప్ కో-ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు మిగతాది 2లో...

# ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)
వ్యక్తులతో గాకుండా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి చేస్తున్నారు. అదంతా ఒక పక్రియ ప్రకారం జరుగుతోంది. ప్రతిపక్షాలకు ఓట్లు- వేసే కమ్యూనిటీలను మరీ ముఖ్యంగా లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనికి సంబంధించి మేం 100 శాతం ఆధారాలను గుర్తించామన్నారు. త్వరలో ఎన్నికల సంఘంపై హైడ్రోజన్ బాంబ్ పేల్చబోతున్నట్లుగా ప్రకటించినట్టుగానే గురువారం రాహుల్‌గాంధీ పేల్చారు. ఓట్ల చోరీపై గతంలో కొన్ని ఆధారాలు బయటపెట్టగా.. ఈరోజు మరిన్ని ఆధారాలను బయటపెట్టారు. మీడియా ముందు వీడియో ప్రజెంటేషన్ ఇస్తూ... ఓట్ల చోరీపై 100 శాతం ఆధారాలతో రుజువులు బయటపెడుతున్నట్లు- ప్రకటించారు. దేశ వ్యాప్తంగా లక్షలాది ఓట్లు- తొలగించాలని కొంత మంది కంకణం కట్టుకున్నారని.. దానికి ఎన్నికల సంఘం వత్తాసు పలుకుతుందని ఆరోపించారు. ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే ఈసీ కళ్లప్పగించి చూస్తోందని ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రంలో ఎన్నికలు అయిపోతే.. ఇంకొక రాష్ట్రంలో.. ఇలా అన్ని రాష్ట్రాల్లో ఎన్నికల సమయానికి లక్షలాది మంది ఓట్లను తొలగిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ఇందుకోసం కేంద్రీకృత సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి.. కాంగ్రెస్ బూత్‌ల నుంచి ఓట్లు- తొలగించారని వివరించారు. ఇందుకు ప్రత్యేక ఉదాహరణగా 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు బలమైన ఓటు- బ్యాంక్ ఉన్న బూత్‌ల నుంచి వేలాది ఓట్లు తొలగించినట్లు- వెల్లడించారు. వేరే రాష్ట్రాల ఫోన్ నెంబర్లు, నకిలీ లాగిన్‌లు ఉపయోగించి ఓటర్ పేర్లు తొలగించారన్నారు. ఇందుకోసం ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ ఉపయోగించారని స్పష్టం చేశారు. ఒక ఎన్నిక తర్వాత ఒక ఎన్నికలో.. భారతదేశం అంతటా లక్షలాది మంది ఓటర్లను.. వివిధ వర్గాలను, ప్రధానంగా ప్రతిపక్షానికి ఓటు- వేస్తున్న వర్గాలను, తొలగింపు కోసం ఒక సమూహం క్రమపద్ధతిలో లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనికి మేము 100 శాతం రుజువును కనుగొన్నాము. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. రాజ్యాంగాన్ని ప్రేమిస్తున్నాను. ప్రజాస్వామ్య పక్రియను ప్రేమిస్తున్నాను. నేను ఆ పక్రియను రక్షిస్తున్నాను. మీరు నిర్ణయించగల 100 శాతం రుజువు ఆధారంగా కాకుండా నేను ఇక్కడ ఏమీ చెప్పబోవడం లేదు. తీర్పు మీదేనని రాహుల్ గాంధీ అన్నారు.ర్ణాటకలోని అలంద్ నియోజకవర్గంలో ఎవరో 6,018 ఓట్లను తొలగించడానికి ప్రయత్నించారని.. చివరికి ఎవరో పట్టుబడ్డారన్నారు. ఇది చాలా నేరాల మాదిరిగానే యాదృచ్ఛికంగా పట్టుబడినట్లు- తెలిపారు. ఈ తొలగింపు ప్రయత్నాలు కేవలం కాంగ్రెస్ పార్టీ గెలిచే బూత్‌ల్లోనే జరిగిందని వివరించారు. గోదాబాయి పేరుతో ఎవరో నకిలీ లాగిన్ సృష్టించి 12 మంది ఓటర్ల పేర్లు తొలగించారన్నారు. కానీ ఈ విషయం గోదాబాయికి తెలియదని చెప్పారు. వివిధ రాష్ట్రాలకు సంబంధించిన ఫోన్ నెంబర్ల ద్వారా ఈ తతాంగం అంతా చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. వారంలోపు ఈసీ డేటా విడుదల చేయాలని.. లేకపోతే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నవారిని రక్షిస్తున్నారని భావించాల్సి ఉంటుందని తెలిపారు. కర్ణాటకలోని అలంద్‌లో ఆరువేల ఓట్లను తొలగించే ప్రయత్నం జరిగిందని విమర్శించారు. అలాగే ఓట్ల చోరీకి పాల్పడేవారిని ఎన్నికల సంఘం చీఫ్ రక్షిస్తున్నారని, ఈ వ్యవహారంపై విచారణ జరపాలంటూ చేస్తున్న అభ్యర్థనలను విస్మరిస్తున్నారని అన్నారు. ఇది హైడ్రోజన్ బాంబ్ కాదని, దానిని త్వరలో పేలుస్తానని వెల్లడించారు. ఈ విమర్శలను ఎన్నికల సంఘం, భారతీయజనతా పార్టీ ఖండించింది. బాంబ్ తుస్సు అందని భాజపా ఎద్దేవా చేసింది.




## ఏపీలో ప్రముఖ దేవాలయాల బోర్డులకు కొత్త ఛైర్మన్లు

**వివిధ దేవాలయాల బోర్డులకు ఛైర్మన్లు వీరే...!**

1. శ్రీ భ్రమమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం పోతుగుంట రమేశ్ నాయుడు
2. శ్రీ కాళహస్తీశ్వర స్వామి దేవస్థానం, శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా కొట్టె సాయిప్రసాద్
3. శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం వి. సురేంద్ర బాబు (మణి నాయుడు)
4. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం, ఇంద్రకీలాద్రి బొర్రా రాధాకృష్ణ (గాంధీ)
5. శ్రీ వెంకటేశ్వర ఆలయం, వాడపల్లి ముదునూరి వెంకట్రాజు

**టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీలకు అధ్యక్షులు**

1. టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్ ఏ.వి. రెడ్డి
2. టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ, హిమాయత్‌నగర్, హైదరాబాద్ నేమూరి శంకర్ గౌడ్
3. టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ, బెంగళూరు వీరాంజనేయులు
4. టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ, ఢిల్లీ ఏడుగుండ్ల సుమంత్ రెడ్డి
5. టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ, ముంబై గౌతమ్ సింఘానియా
6. టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ, విశాఖపట్నం వెంకట పట్టాభిరామ్ చోడే

## సిఎంతో బ్రిటిష్ హైకమిషనర్ లిండీ భేటీ

(మొదటి పేజీ తరువాయి)
లిండీ కామెరాన్ అంగీకరించారు. ఎడ్యుకేషన్, టెక్నాలజీ సంబంధిత రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు- ముఖ్యమంత్రికి బ్రిటిష్ హైకమిషనర్ వివరించారు. యూకే యూనివర్సిటీలలో చదువుకునే తెలంగాణ విద్యార్థుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి అక్కడి యూనివర్సిటీలు ఆపరేట్ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ సందర్భంగా తెలంగాణలో తీసుకురాబోతున్న కొత్త ఎడ్యుకేషన్ పాలసీ డ్రాఫ్ట్‌ను కూడా బ్రిటీష్ హైకమిషనర్‌కు సీఎం వివరించారు.రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు ట్రైనింగ్ అందించేందుకు బ్రిటిష్ హైకమిషనర్ సుముఖత వ్యక్తం చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో బ్రిటీష్ కంపెనీలు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి కోరారు. జీసీసీ, ఫార్మా, నాలెడ్జ్, అకాడమీ విభాగాల్లో పెట్టుబడులకు ముందుకు రావాలని సీఎం కోరగా.. అందుకు బ్రిటీ-ష్ హైకమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశానికి డిప్యూటీ- హైకమిషనర్ హైదరాబాద్ గారెత్ విన్ ఓవెన్, పొలిటికల్ ఎకానమి అడ్వైజర్ నళిని రఘురామన్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి హాజరయ్యారు. విద్య, సాంతకేతిక సంబంధిత రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు- బ్రిటిష్ హైకమిషనర్ సీఎంకు వివరించారు.

# ఎపి లిక్కర్ స్కామ్ కేసులో ఇడి దాడులు

(మొదటి పేజీ తరువాయి)
ధనుంజయరెడ్డి (ఏ-31), కృష్ణమోహన్‌రెడ్డి (ఏ-32), బాలాజీ గోవిందప్ప (ఏ-33), పైలా దిలీప్ (ఏ-30)లు బెయిల్‌పై బయటకు రాగా.. చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేశ్‌నాయుడు సహా మొత్తం 8 మంది ఇంకా జైల్లోనే ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఏకకాలంలో తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీలలోని 20 ప్రాంతాల్లో దాడులు జరిగాయి. మద్యం కుంభకోణం నిందితుల సంస్థలు, కార్యాలయాల్లో అధికారులు సోదాలు చేశారు. లిక్కర్ స్కాంలో ఉన్న నిందితుల ఇళ్లలోనూ ఈడీ సోదాలు జరిగాయి. నకిలీ ఇన్వాయిస్‌లు, పెంచిన మద్యం ధరల వెనుక భారీ స్కాం జరిగినట్లు ఈడీ గుర్తించింది. ఈ కేసులో సిట్ ఇప్పటివరకూ 29 మంది వ్యక్తులు, 19 సంస్థలను నిందితులుగా చేర్చి.. 12 మందిని అరెస్టు చేసింది.ఏపీ మద్యం కుంభకోణం మొత్తం విలువ రూ. 3,500 కోట్లుగా ఈడీ అంచనా వేసింది. నకిలీ ఇన్‌వాయిస్‌లు, పెంచిన బిల్లుల ఆధారంగా కిక్ బ్యాక్‌లు చెల్లింపులు జరిగాయని దర్యాప్తులో బయటపడింది. పలు కంపెనీలు, మద్య వ్యాపారాలకు సంబంధించిన కీలక వ్యక్తులు ఈ స్కాంలో ప్రమేయం ఉన్నట్లు- అనుమానం వ్యక్తం చేస్తోంది. ఫ్రంట్ కంపెనీలు ద్వారా డబ్బు లావాదేవీలు జరిగాయని ఈడీకి ఆధారాలు లభించాయి. కిక్ బ్యాక్‌ల కోసం తప్పుడు ఖర్చుల చూపులు, మేనిప్యులేటెడ్ బిల్లులు వాడారని ఆరోపణలు ఉన్నాయి. నిందితుల ఇళ్లు, ఆఫీసులు, గోదాములు, సంబంధిత అకౌంటింగ్ సంస్థల ప్రాంగణాల్లో శోధనలు జరుగుతున్నాయి.ఏపీ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ రిపోర్టులు, ఐటీ- శాఖ సమాచారం ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసింది. కుంభకోణంలో రాజకీయ సంబంధాల కోణాన్ని కూడా పరిశీలిస్తోంది. ఈడీ దాడుల్లో పెద్ద మొత్తంలో డాక్యుమెంట్లు-, డిజిటల్ డేటా, లావాదేవీల రికార్డులు స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. హవాలా మార్గంలో సుమారు వందల కోట్ల సొమ్ము తరలింపులు జరిగాయని అనుమానం వ్యక్తం చేస్తోంది. ఈ దాడులు మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉన్నట్లు- సమాచారం. ఈ కేసుకు సంబంధించిన ఇప్పటికే పలువురు నిందితులు.. ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలు అరెస్ట అయి.. బెయిల్‌పై జైలు నుంచి విడుదలయ్యారు. ఇక ఇదే కేసులో అరెస్ట్ అయి.. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి సైతం బెయిల్ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాంటి వేళ.. ఈ మద్యం కుంభకోణంలో దర్యాప్తు చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. ఆ క్రమంలో చెన్నై, హైదరాబాద్, న్యూఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ఈడీ అధికారులు గురువారం ముమ్మర దాడులు నిర్వహించారు. దాదాపు 10 బృందాలు ఈ దాడుల్లో పాల్గొన్నట్లు- తెలుస్తోంది. ముఖ్యంగా ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి ఆస్తులపై ఈడీ దృష్టి సారించినట్లు- సమాచారం. మద్యం వ్యవహారంలో పొందిన ముడుపులను షెల్ కంపెనీలకు పంపిన తద్వారా నల్ల ధనాన్ని వైట్‌గా మార్చారంటూ ఇప్పటికే రాజ్ కసిరెడ్డిపై సిట్ నిగ్గు తేల్చింది. ఈ వ్యవహారానికి సంబంధించి.. సిట్ నుంచి
ఈడీ సీనియర్ అధికారులు అందుకు సంబంధిందచిన సమగ్ర సమాచారాన్ని మూడు రోజుల క్రితమే తీసుకున్నట్లు- తెలుస్తోంది. మొత్తం 23 సూట్ కేసు కంపెనీలలో జరిగిన లావాదేవీలపై ఈడీ ఈ సందర్భంగా దృష్టి సారించినట్లు- తెలుస్తోంది. అలాగే ఇప్పటి వరకు సిట్ దాఖలు చేసిన చార్జిషీట్‌లోని నిందితుల ఆస్తులు, కంపెనీలపై సైతం ఈడీ దృష్టి సారించింది. అదే విధంగా హైదరాబాద్‌లో సిట్ స్వాధీనం చేసుకున్న రూ. 11 కోట్ల నగదు వివరాలను సైతం ఈడీ అధికారులు అడిగి తెలుసుకున్నట్లు- తెలుస్తోంది. ఈ దాడులు సమయంలో ఎప్పటికప్పుడు సిట్ అధికారులతో సంప్రదిస్తూ.. తమకున్న సందేహాలను ఈడీ అధికారులు నివృత్తి చేసుకుంటున్నారని సమాచారం. తిరుపతి, హైద్రాబాద్‌లోని మరి కొన్ని కంపెనీలపై కూడా ఈ దాడులు చేసేందుకు మరిన్ని బృందాలు ఇప్పటికే ఢిల్లీ నుంచి బయలు దేరినట్లు- తెలుస్తుంది. అందుకోసం ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు తిరుపతిలో పలు బృందాలు ఎదురు చూస్తున్నాయి

## మండలి నుంచి వైసీపీ వాకౌట్...

(మొదటి పేజీ తరువాయి)
దీనికి నిరసనగా తాము సభను బహిష్కరించామని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తెలిపారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.తిరుపతి, సింహాచలం దేవస్థానాల్లో జరిగిన దురదృష్టకర ఘటనలపై తాము ప్రశ్న అడిగితే, ప్రభుత్వం సూటిగా సమాధానం చెప్పలేదని బొత్స విమర్శించారు. భక్తుల మనోభావాలకు సంబంధించిన సున్నితమైన విషయంపై కూడా హుందాతనం లేకుండా మాట్లాడారని మండిపడ్డారు. దేవాలయాల విషయంలో నిర్లక్ష్యంగా సమాధానమిచ్చిన సంబంధిత మంత్రి వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి దేవుడి పట్ల, భక్తుల పట్ల ఏమాత్రం గౌరవం లేదని ఈ ఘటనతో స్పష్టమైందన్నారు.ఇదే కాకుండా ఇతర అంశాల్లోనూ మంత్రుల వైఖరి ఇలాగే ఉందని బొత్స ఆరోపించారు. 50 ఏళ్లకే పింఛను ఇస్తామన్న హామీ గురించి అడిగితే సమాధానం దాటవేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో మద్యం అమ్మకాలు, కల్తీ మద్యం, బెల్ట్ షాపులపై అడిగిన ప్రశ్నలకు కూడా డొంకతిరుగుడు సమాధానాలు చెప్పారని దుయ్యబట్టారు. రైతులు యూరియా కోసం పడుతున్న ఇబ్బందులపై చర్చిద్దామన్నా ప్రభుత్వం ముందుకు రావడం లేదని విమర్శించారు. మండలిలో జరిగే చర్చలు ప్రజలకు మేలు చేసేలా ఉండాలి కానీ, ప్రస్తుత ప్రభుత్వంలో ఆ పరిస్థితి కనిపించడం లేదని బొత్స సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.

## కరేడు భూములు బలవంతంగా లాక్కోవడంలేదు

### ఇండోసోల్ పరిశ్రమ భూసేకరణపై మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరణ

అమరావతి **సెప్టెంబర్ 18 ఆంధ్ర ప్రగతి :**
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కరేడు వద్ద ఇండోసోల్ పరిశ్రమ ఏర్పాటు కోసం రైతుల నుంచి భూములను బలవంతంగా సేకరిస్తున్నారంటూ వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. ప్రభుత్వం ఎకరాకు రూ. 20 లక్షల పరిహారాన్ని ప్రకటించడంతో, రైతులు పూర్తి స్వచ్ఛందంగానే తమ భూములను పరిశ్రమకు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారని ఆయన తెలిపారు.శాసనమండలిలో వైసీపీ సభ్యుడు తూమాటి మాధవరావు అడిగిన ప్రశ్నకు మంత్రి అనగాని సమాధానమిచ్చారు. ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో ఇండోసోల్ పరిశ్రమ ఏర్పాటు కోసం జరుగుతున్న భూసేకరణలో ఎలాంటి ఒత్తిళ్లకు తావులేదని ఆయన తేల్చిచెప్పారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "రామాయపట్నం పోర్టు నిర్మాణం ప్రకాశం జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్ష. దానికి అనుబంధంగా ఒక పారిశ్రామిక హబ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా, ఇండోసోల్ సంస్థ రూ. 43 వేల కోట్ల భారీ పెట్టుబడితో పరిశ్రమను స్థాపించేందుకు ముందుకు వచ్చింది" అని వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 30 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. మొత్తం 8,214 ఎకరాల భూమిని ఈ ప్రాజెక్టు కోసం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం నుంచి పరిశ్రమలు తరలిపోయాయని, కానీ తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి పెట్టుబడులు వస్తున్నాయని మంత్రి అనగాని విమర్శించారు. రైతులకు న్యాయమైన పరిహారం అందిస్తూ, పారిశ్రామిక అభివృద్ధికి బాటలు వేయడం తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గొప్ప ఊతాన్ని ఇస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# జీఎస్టీ సంస్కరణలతో అభివృద్ధి వేగం

(మొదటి పేజీ తరువాయి)
ఐదు టైర్ల స్లాబ్‌ల నుంచి 2 స్లాబ్‌లకు జీఎస్టీని మార్చడం వల్ల 140 కోట్ల మందికి మేలు జరుగుతుందని తెలిపారు. ఈసారి అన్ని పండుగలు ఘనంగా చేసుకునే అవకాశం వస్తుందని చెప్పుకొచ్చారు. గతంలో సంక్రాంతికి కానుక ఇచ్చామని... ఈరోజు జీఎస్టీ సవరణలతో 12 శాతంలో ఉన్న వారు సున్నా శాతం జీఎస్టీ కిందకు వచ్చేస్తారని తెలిపారు. కొంతమందే ఇలాంటి జీఎస్టీ సవరణలు చేయగలుగుతారని... అలాంటి వారిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముందుంటారని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. 11 సంవత్సరాల్లో ప్రధాని మోదీ నిర్ణయాలు చూస్తే ట్యాక్స్ పేయర్స్ 130 శాతం మంది పెరిగారని వివరించారు. జీఎస్టీ బిల్లులు 207 శాతం పెరిగాయని... ఈరోజు రూ.22.08 లక్షల కోట్ల ఆదాయం జీఎస్టీ ద్వారా వస్తోందని వెల్లడించారు. అన్ని రాష్ట్రప్రభుత్వాలకు జీఎస్టీ 2.0 సవరణలను వివరించిన తర్వాతనే ఆమోదించారని తెలిపారు. ఇంకా కొంచెం కష్టపడితే డబుల్ డిజిట్స్ సాధించే ఏ-కై-క దేశం భారతదేశమే అవుతుందని నొక్కిచెప్పారు సీఎం చంద్రబాబు. జీఎస్టీ వల్ల రూ.2లక్షల కోట్లు- జనరేట్ అవుతుందని వివరించారు. ఎంత ఇన్సెంటివ్స్ ఇస్తున్నామో అంత ప్రభావం జీఎస్టీ 2.0 సవరణల ఒక్క నిర్ణయం వల్ల వస్తుందని అన్నారు. ట్యాక్స్ , ఉద్యోగాలు, ఆదాయం ఇలా ఒకదానికి ఒకటి ఆధారపడి ఉండి ఆర్థిక వ్యవస్థకు బూస్ట్‌గా తయారు అవుతాయని చెప్పుకొచ్చారు. ఈ బెనిఫిట్‌ను డబుల్ ఇంజన్ సర్కార్ ఎలా ఉపయోగపడుతుందో ప్రజలకు చెప్పాలని సూచించారు. నిత్యావసరాలు చాలా వరకూ బెనిఫిట్ లభిస్తుందని పేర్కొన్నారు. కార్లు, ఏసీలు, ఫ్రిడ్జ్‌లు 28 నుంచి 18శాతం జీఎస్టీ తగ్గుతుందని.. దీంతో మధ్యతరగతి వారు కూడా ఏసీలు వినియోగించడానికి ముందుకు వస్తారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

### జీఎస్టీ సంస్కరణలకు ఎపి తొలి మద్దతు
**శాసనభలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్**

: రాష్ట్ర ఆదాయాలకు ఇబ్బందిగా ఉన్నా జీఎస్టీ చారిత్రాత్మక సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలి రాష్ట్రం ఏపీనే అని డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ ఉద్ఘాటించారు. జీఎస్టీ పన్నుల నూతన విధానం ద్వారా ప్రజలకు మేలు చేసే విధానం మంచిదని.. దీనివల్ల దేశం స్థిరమైన వృద్ధి పెరుగుతోందని చెప్పుకొచ్చారు.జీఎస్టీ 2.0 సంస్కరణలపై ఏపీ శాసనసభలో డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ తీర్మానం చేశారు. 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జీఎస్టీ సంస్కరణలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటనను స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. జీఎస్టీ మండలి 56వ సమావేశంలో జీఎస్టీ సంస్కరణలను కేంద్రమంత్రి నిర్మాలా సీతారామన్ ఆమోదించారని గుర్తుచేశారు. ఇది ప్రజలు, ఆర్థిక వ్యవస్థకు చాలా లాభదాయకని నొక్కిచెప్పారు. వ్యవసాయ పనిముట్లు-, యంత్రాల రేట్లు తగ్గి ఉత్పత్తి పెరుగుతుందని పేర్కొన్నారు. పాలు, పెరుగుపై పన్ను 5శాతం నుంచి సున్నా శాతానికి అలాగే నిత్యావసరాల ధరలు చాలా వరకూ 18 నుంచి 5శాతానికి తగ్గుతున్నాయని గుర్తుచేశారు. సిమెంట్‌పై పన్నును 28 నుంచి 18కి తగ్గించారని తెలిపారు. అత్యవసర మందులపై జీఎస్టీ పన్ను లేకుండా చేయడం ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ సంస్కరణల ద్వారా ప్రజల చేతిలో సంపద పెరిగి వస్తువుల వాడకం పెరుగుతుందని పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు. జీఎస్టీ విషయంలో అన్ని వాణిజ్య, వ్యాపార సంఘాలు అంగీకారం తెలిపినందుకు ఏపీ ప్రభుత్వం తరఫున ధన్యవాదాలు చెబుతున్నట్లు- పేర్కొన్నారు. జిల్లా నుంచి గ్రామస్థాయి వరకూ ఏఏ బెనిఫిట్స్ జీఎస్టీ సంస్కరణల ద్వారా అమలు అవుతాయో తెలియజేయాల్సిన అవసరం కూడా ఉందని నొక్కి చెప్పారు పవన్. పరస్పర అవగాహనతోపాటు- మీడియా వేదిక ద్వారా ప్రజలకు లాభాల గురించి తెలియజేయాలని కోరారు. జీఎస్టీ సంస్కరణలపై ఏపీ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## దసరా ప్రయాణికులకు శుభవార్త

### 7,754 స్పెషల్ బస్సులను నడపనున్న ఆర్టీసి

(మొదటి పేజీ తరువాయి)
ప్రజల ప్రయాణాన్ని సురక్షితంగా, సౌకర్యవంతంగా మార్చడమే లక్ష్యంగా ఆర్టీసీ ఈ చర్యలు చేపట్టింది. ఈ పండుగ సీజన్‌లో ప్రయాణికుల రద్దీని సులభతరం చేయడానికి, టీ-జీఎస్‌ఆర్టీసీ సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 2 వరకు ఏకంగా 7,754 స్పెషల్ బస్సులను నడపనుంది. ఈ బస్సులలో, 377 సర్వీసులకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించబడింది. దీంతో ప్రయాణికులు ఇంటి నుంచే తమ టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చు, తద్వారా కౌంటర్ల వద్ద నిరీక్షణ తప్పించుకోవచ్చు. సెప్టెంబర్ 30 న సద్దుల బతుకమ్మ , దసరా రోజు రోజుల్లో సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య భారీగా ఉండే అవకాశం ఉంది. ఈ రద్దీని తట్టుకోవడానికి ప్రధాన బస్టాండ్ల నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులోకి వస్తాయి. అలాగే, పండుగలు ముగిసిన తర్వాత తిరిగి నగరానికి వచ్చేవారి సౌకర్యార్థం అక్టోబర్ 5, 6 తేదీల్లో కూడా ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఈ ప్రత్యేక బస్సుల ద్వారా, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సులభంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. అదనపు ఛార్జీలు లేకుండానే సాధారణ బస్సుల టికెట్ ధరలకే ఈ సేవలు లభ్యం అవుతాయి. దసరా పండుగను ఆనందంగా జరుపుకోవడానికి ఊరెళ్లే ప్రయాణికులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరారు. మరిన్ని వివరాల కోసం టీ-జీఎస్‌ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా సమీపంలోని బస్టాండ్‌లో విచారించవచ్చు.

# స్థలాలను వెనక్కి తీసుకునే అధికారం ఎవరిచ్చారు ?

**(మొదటి పేజీ తరువాయి)**అని మరోసారి రుజువైందని ఆయన విమర్శించారు.గురువారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో, ప్రస్తుత ప్రభుత్వ విధానాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "పేద అక్కచెల్లెమ్మలకు రిజిస్ట్రేషన్ చేసి మరీ ఇచ్చిన ఇళ్ల స్థలాలను రద్దు చేసే అధికారం మీకు ఎవరు ఇచ్చారు? వాళ్లు ఇళ్లు కట్టుకునేలా అండగా నిలబడాల్సింది పోయి, మా హయాంలో ఇచ్చిన స్థలాలను లాక్కుంటారా? వారి ఉసురు పోసుకుంటారా?" అంటూ ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ నిర్ణయాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.తమ ప్రభుత్వ హయాంలో చేపట్టిన "పేదలందరికీ ఇళ్లు" కార్యక్రమం వివరాలను జగన్ వెల్లడించారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 71.8 వేల ఎకరాల భూమిని సేకరించి, 31.19 లక్షల మంది పేద మహిళలకు వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి పట్టాలు అందించామని గుర్తుచేశారు. కేవలం భూమి కొనుగోలుకే రూ. 11,871 కోట్లు ఖర్చు చేశామని, ఈ స్థలాల ప్రస్తుత మార్కెట్ విలువ రూ. 1.5 లక్షల కోట్ల కంటే ఎక్కువే ఉంటుందని ఆయన అంచనా వేశారు. కొన్ని ప్రాంతాల్లో ఒక్కో పట్టా విలువ రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు ఉందని తెలిపారు. తమ ఐదేళ్ల పాలనలో ఇళ్ల స్థలాల కోసం ఎక్కడా ధర్నాలు, ఆందోళనలు కనిపించకపోవడమే తమ చిత్తశుద్ధికి నిదర్శనమని జగన్ పేర్కొన్నారు.ఇళ్ల నిర్మాణంలోనూ తమ ప్రభుత్వం రికార్డు సృష్టించిందని జగన్ తెలిపారు. మొత్తం 21.75 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి పనులు ప్రారంభిస్తే, రాష్ట్రంలో 17,005 కొత్త కాలనీలు రూపుదిద్దుకున్నాయని వివరించారు. కరోనా వంటి తీవ్రమైన సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొని కూడా, తమ ఐదేళ్ల పాలనలో 9 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని ఆయన తెలిపారు. 2023 అక్టోబర్ 12న ఒకే రోజు 7,43,396 ఇళ్లను ప్రారంభించి చరిత్ర సృష్టించామని, చంద్రబాబు తన జీవితంలో ఎప్పుడైనా ఇలాంటి ఘనత సాధించారా అని ప్రశ్నించారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాన్ని ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు నిలిపివేసిందని, ఇది పేదల ఆశలను వమ్ము చేయడం కాదా అని నిలదీశారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం19 సెప్టెంబర్ 2025

# జిల్లా ఫిజియోథెరపీ సంఘానికి జాతీయ స్థాయి పురస్కారం.

**దక్షిణ భారత దేశం నుండి పురస్కారానికి ఎంపికైన ఏకైక జిల్లా.**

**ఢిల్లీలో పురస్కారం అందించిన ఎం.పీ. బన్సూరి స్వరాజ్, జాతీయ అధ్యక్షుడు సంజీవ్ కుమార్.**

**జిల్లా శాఖ తరపున పురస్కారం అందుకున్న డాక్టర్ కాటసాని శివ బాలి రెడ్డి,డాక్టర్ రోహిణి విజయ్.**

**నంద్యాల జిల్లా ఫిజియోథెరపీ శాఖను అభినందించిన డాక్టర్ రవి కృష్ణ.**




ఢిల్లీలో జాతీయ స్థాయి పురస్కారం అందుకుంటున్న నంద్యాల జిల్లా ఫిజియోథెరపీ సంఘం ప్రతినిధులు డాక్టర్ శివ బాలి రెడ్డి,డాక్టర్ రోహిణి విజయ్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా సెప్టెంబర్ 18:** ఢిల్లీలో ఇండియా కాన్స్టిట్యూషన్ క్లబ్ వేదికపై గత ఆదివారం జాతీయ ఫిజియోథెరపీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన మూడవ జాతీయ సదస్సులో నంద్యాల జిల్లా ఫిజియోథెరపిస్ట్ ల సంఘానికి, ఫిజియోథెరపీ పై ప్రజా అవగాహన కార్యక్రమాలు,రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు,ఉచిత శిబిరాలు నిర్వహించినందుకు, జాతీయస్థాయి ఉత్తమ జిల్లా శాఖ పురస్కారం అందించారని నంద్యాల జిల్లా ఫిజియోథెరపీ సంఘం కోశాధికారి జగదీశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయస్థాయిలో ఆరు పురస్కారాలు అందించగా, దక్షిణ భారతదేశంలో ఈ పురస్కారానికి ఎంపికైన ఏకైక జిల్లా నంద్యాల జిల్లా ఫిజియోథెరపీ సంఘం కావడం విశేషం. ఈ పురస్కారాన్ని పార్లమెంట్ సభ్యులు బన్సూరి స్వరాజ్, రాజీవ్ భరద్వాజ్, జాతీయ ఫిజియోథెరపీ సంఘం అధ్యక్షులు డాక్టర్ సంజీవ్ కుమార్ చేతుల మీదుగా నంద్యాల జిల్లా శాఖ తరపున డాక్టర్ కాటసాని శివ బాలి రెడ్డి, డాక్టర్ రోహిణి విజయ్ స్వీకరించారు. సదస్సుకు హాజరైన పుదుచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ వీరిని ప్రత్యేకంగా అభినందించారు. డాక్టర్ రోహిణి విజయ్ మాట్లాడుతూ ఈ జాతీయ స్థాయి సదస్సుకు కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారని తెలిపారు. డాక్టర్ శివ బాలి రెడ్డి మాట్లాడుతూ ఎలైడ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ నేషనల్ కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ యజ్ఞ శుక్ల ఎన్. సి.ఎ.హెచ్.పి. 2021 యాక్ట్ ప్రకారం ఫిజియోథెరపిస్టులు తమ పేరు ముందు డాక్టర్ అని పెట్టుకోవచ్చని ఈ సదస్సులో. ప్రకటించారని తెలిపారు. ఈ సదస్సులో డాక్టర్ శివ బాలి రెడ్డి" ఫిజియోథెరపీ చికిత్సలో సైకాలజీ పాత్ర" పై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. డాక్టర్ రోహిణి విజయ్ ఈ సదస్సులో ఒక వైజ్ఞానిక చర్చా కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఫిజియోథెరపీ సంఘ గౌరవ సలహాదారు, ఐఎంఎ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ జాతీయస్థాయి ఉత్తమ జిల్లా శాఖ పురస్కారం అందుకున్న నంద్యాల జిల్లా ఫిజియోథెరపీ సంఘ సభ్యులను అభినందించారు. భవిష్యత్తులో కూడా ప్రజా అవగాహన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. పరిశోధన పత్రం సమర్పించిన డాక్టర్ కాటసాని శివ బాలి రెడ్డిని, జాతీయ సదస్సులో వైజ్ఞానిక చర్చా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ రోహిణి విజయ్ లను ప్రత్యేకంగా అభినందించారు.

# బాల్య వివాహాలపై అవగాహన ఉండాలి.



**ఆంధ్ర ప్రగతి మహానంది సెప్టెంబర్ 18:**ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని బాలల సంరక్షణ అధికారి కే.శ్రీనివాస్, డీసీపీయు అధికారిణి సీ .సునంద కుమారి పేర్కొన్నారు.గురువారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బాల్య వివాహాలు,బాలల హక్కులు, బాల కార్మికుల, విద్యా హక్కు పలు చట్టాలపై అవగాహన కల్పించారు.బాలల సంరక్షణ అధికారి కే.శ్రీనివాస్ మాట్లాడుతూ..18 సంవత్సరాల లోపు అమ్మాయిలకు 21 సంవత్సరాల్లోపు అబ్బాయిలకు పెళ్లి చేస్తే చట్టరీత్యా నేరమని తెలిపారు. బాల్యవివాహం ఎక్కడైనా జరుగుతుందని తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ హెల్ప్ లైన్ 100, ఉమెన్ హెల్ప్ లైన్ 181 చరవాణి ద్వారా సమాచారం అందజేయాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. డీసీపీయు అధికారిణి సీ .సునంద కుమారి మాట్లాడుతూ.. అమ్మాయిలు అపరిచితుల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని ఎవరైనా మనల్ని అసభ్యకరంగా మాట్లాడిన అసభ్యకరంగా ప్రవర్తించిన వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, హెల్ప్ లైన్ నెంబర్లుకు చెప్పాలన్నారు.అమ్మాయిలు బాగా చదువుకొని మంచి ప్రయోజకులు కావాలని కోరారు. ఇంటికి వెళ్ళినప్పుడు పిల్లలు తల్లిదండ్రులతో సమయాన్ని గడపాలని, వారికి తమ జీవితంలో జరిగే ప్రతి విషయం తల్లిదండ్రులతో , ఉపాధ్యాయులతో పంచుకోవడం వల్ల సమస్యలు తీరుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

# సర్వం వాసుదేవమయం అనే
# అఖండ జ్ఞానమే ముక్తికి ఏకైక మార్గం.

**డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు - ప్రముఖ ధార్మిక ప్రవచకులు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 18:**సర్వం వాసుదేవమయం అనే అఖండ జ్ఞానమే ముక్తికి ఏకైక మార్గమని, భారతీయ ఇతిహాసాలు, పురాణాలు, వేదాలు, ఉపనిషత్తులన్నీ కూడా ఏకాత్మతా భావనను పెంచుతున్నాయని, ఆ భావననే దేశ ఐకమత్యానికి, పురోభివృద్ధికి కారణంగా నిలుస్తున్నదని ప్రముఖ ధార్మిక ప్రవచకులు, తి.తి.దే. వ్యాఖ్యాత డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మాభిచార పరిషత్తు ఆధ్వర్యంలో పాణ్యం మండలం, తొగడ్చేడు గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం నందు ఏర్పాటు చేసిన ధార్మిక కార్యక్రమాలలో భాగంగా వారు శ్రీమద్రామాయణంపై సుదీర్ఘ ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమంలో హిందూధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ చాకిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , కాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, భజన గురువు వై. పి. బాలనాగిరెడ్డి, కాశిరెడ్డి రామాంజనేయ రెడ్డి, అర్చకులు అనంతరామయ్య, బాలసుబ్బారెడ్డి భజన బృందం, సి. తులసమ్మ, సి. విజయమ్మ, మంగలి లక్ష్మీదేవి, కె విజయమ్మ, ఇ. దేవమ్మతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు ఇంటి స్థలాలు
# వచ్చేంతవరకు పోరాటం ఆగదు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 18:** నంద్యాల పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ప్రభుత్వం ఇచ్చేంతవరకు మా పోరాటం ఆగదని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె రామాంజనేయులు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు తెలిపారు. స్థానిక నేషనల్ పీజీ కాలేజ్ ఆవరణలో మహిళా సమాఖ్య పట్టణ సమావేశం మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ సుశీలమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశమునకు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె రామాంజనేయులు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి సోమన్న ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి హాజరైనారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె రామాంజనేయులు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో నాలుగు విడతల్లో సచివాలయాల దగ్గర ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఇల్లు లేని నిరుపేదలతో 4000 మందితో వ్యక్తిగత అర్జీలు ఇప్పించడం జరిగింది ఆర్జీలను వెరిఫై చేయడంలో సచివాలయ ఉద్యోగులు గాని మున్సిపాలిటీ అధికారులు ఎమ్మార్వో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు వెంటనే ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి ప్రభుత్వం చెప్పిన విధంగా పట్టణంలో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి పక్కా ఇంటికి ఐదు లక్షలు ఇవ్వాలని అన్నారు. అనంతరం ఏపీ మహిళా సమాఖ్య నంద్యాల పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా పద్మావతి ఉపాధ్యక్షులుగా సరోజమ్మ రమాదేవి ప్రధాన కార్యదర్శిగా సుశీలమ్మ. సహాయ కార్యదర్శులుగా రమీజాభి వరాలు. కోశాధికారిగా సునీత తోపాటు 21 మందితో ఎన్నుకోవడం జరిగింది.ఈ సమావేశంలో 50 మంది మహిళలు పాల్గొనడం జరిగింది

# డా.దాల్మిల్ ఆమీర్ బాష ఆధ్వర్యంలో వైభవంగా
# మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి జన్మదిన వేడుకలు.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 18:** నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు డా.దాల్మిల్ అమీర్ బాష ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే గృహం వద్ద వైఎస్సార్సీపీ నాయకులు, కౌన్సిలర్లు, అభిమానులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. నంద్యాల పట్టణ శివారులోని ఎస్సార్బీసీ కాలనీలోని పరివర్తన లైఫ్ సెంటర్ నందు కేక్ కట్ చేసి చిన్నారులకు నూతన వస్త్రాలు, అన్నదానం నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. అలాగే విజయబ్లడ్ బ్యాంక్ వారి సహకారంలో రక్తదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కృ ష్ణమోహన్, వైసీపీ నాయకులు కిరణ్, లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, వైసిపి మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైగర్ శివ, పార్థుడు, భాస్కర్ రెడ్డి, శేఖర్, దుర్గాప్రసాద్, ఎర్రన్న, తదితరులు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు డా.దాల్మిల్ అమీర్ బాష, కౌన్సిలర్ కృష్ణమోహన్, వైసీపీ నాయకులు కిరణ్ మాట్లాడుతూ... మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి రాజకీయంగా, సామాజికంగా అనేక సేవాకార్యక్రమాలను చేపడుతూ అందరికి ఆదర్శంగా నిలిచారని, యువతకు స్ఫూర్తిదాయకంగా వైఎస్సార్సీపీ నాయకులకు, కార్యకర్తలకు మార్గదర్శకంగా అనేక సేవతత్పరత కలిగిన నేతగా అందరి అభిమానాన్ని చూరగొన్నారని కొనియాడారు. ఇటువంటి జన్మదిన వేడుకలను అనేకంగా జరుపుకోవాలని నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో, ప్రజాసేవలో ప్రజల మన్నలను పొందాలని, రాజకీయంగా, సామాజికంగా ప్రజల మనిషిగా ప్రజల గుండెల్లో నిలిచిపోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# నంద్యాల లో ప్రారంభమైన దస్తావేజు లేఖర్ల సమ్మె

**-ఓటీపి విధానాన్ని రద్దు చేయాలి.**

**-నేటి నుండి రాష్ట్ర వ్యాప్త సమ్మె.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 18:** నంద్యాల దస్తావేజు లేఖర్ల సమ్మె (పెన్ డౌన్) గురువారం ప్రారంభమైంది. సబ్ రిజిస్టర్ కార్యాలయం నుండి నినాదాలు చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్షలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా స్టాంప్ రైటర్స్ అండ్ వెండర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్సులు ఫరూక్, రమేష్ లు మాట్లాడుతూ నేటి నుండి వరసగా మూడు రోజులు తమ పనులకు స్వస్తి పలికి పెన్ డౌన్ ప్రకటించి సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వం అనుసరిస్తున్న 2.0 విధానంలోని ఆధార్ ఓటిపి, మొబైల్ ఓటిపి, పిడిఎఫ్ ఫీడింగ్ సమస్యలు, ప్రైవేట్ అటెండెన్స్ వగైరా సమస్యల వల్ల ప్రజల రిజిస్ట్రేషన్ వ్యవహారాలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని డిమాండు చేస్తూ నంద్యాల జిల్లాకు చెందిన యావత్తు దస్తావేజు లేఖర్లు సమ్మెను చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. నేటి నుండి రాష్ట్రవ్యాప్తంగా కూడా స్టాంప్ వెండర్లు సమ్మె చేస్తున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వం దిగివచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఇందుకు పట్టణ, గ్రామ ప్రజలు సహకరించవలసినదిగా కోరుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు మాలిక్, శివరాం, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, భాష, ఆది నారాయణ రెడ్డి, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.



# పిడిఎస్యు 24వ మహాసభలను విజయవంతం చేయండి.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 18:** రాజమండ్రి పట్టణంలోని పీ.డీ.ఎస్.యు జిల్లా కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డీ. రఫీ అధ్యక్షత వహించారు. అనంతరం మీడియా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డీ. రఫీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. కిరణ్ కుమార్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమర వీరులు, తెలంగాణ, నగ్జల్బరీ, శ్రీకాకుళం, గోదావరిలోయ రైతాంగ పోరాటాల ప్రేరణతో, అల్లూరి, భగత్ సింగ్,చేగువేరా స్ఫూర్తితో పుట్టిన ప్రగతిశీల విద్యార్థి ఉద్యమం ఐదు దశాబ్దాలుగా విద్యార్థి లోకంలో తిరుగులేని శక్తిగా నిలిచిందని తెలిపారు. విద్యా రంగ సమస్యలపై రాజీ లేని పోరాటాలు సాగిస్తూ, సమాజంలోని వివక్షతలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ వస్తోందని వారు గుర్తు చేశారు.రాష్ట్రంలో విద్యా వ్యవస్థ గాడి తప్పిపోయిందని, ప్రభుత్వ విద్యా రంగంపై పాలకులు కనీస శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. ప్రభుత్వ విద్యాసంస్థలు సమస్యలకు నిలయాలుగా మారిపోయి, ఆ బలహీనతలను ఆసరా చేసుకొని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపార సరుకుగా మార్చేశాయని తెలిపారు. ఫీజులు, డొనేషన్ల పేరుతో విద్యార్థులపై భారాలు మోపుతున్న ప్రభుత్వం మాత్రం వాటికి విచ్చలవిడిగా అనుమతులు ఇస్తూ ప్రోత్సహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.గత ప్రభుత్వం, నేటి కూటమి ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు 6వేల కోట్లు రూపాయలు పాత బకాయిలు పెండింగ్‌లోనే ఉన్నాయని, ఎన్నికల హామీలైన కార్పొరేట్ కళాశాలల్లో ఫీజుల దోపిడీ, జరుగుతున్న ఆత్మహత్యలపై చర్యలు లేవని మండిపడ్డారు. ప్రైవేటు యూనివర్సిటీలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తూ ఉన్నత విద్యను పేదలకు దూరం చేస్తున్నారని, ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడానికి కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని. నేటికి ప్రభుత్వం డిగ్రీ అడ్మిషన్ ఇవ్వలేదని అన్నారు. ఆటానమస్ హోదాలు ఇస్తూ విద్యా ప్రమాణాలను దిగజారుస్తున్నారని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని కార్పొరేట్ చేతుల్లోకి నెడుతూ, నూతన విద్యా విధానం ద్వారా విద్యకు మత తత్వ రంగు పులిమి విద్యార్థులను మతోన్మాదులుగా మార్చాలని ప్రయత్నిస్తోందని, యూజీసీ నిబంధనల మార్పులు రాష్ట్ర విశ్వవిద్యాలయాల స్వతంత్రతను దెబ్బతీస్తున్నాయని అన్నారు. సిలబస్‌లో శాస్త్రీయ దృక్పథం కలిగిన అంశాలను తొలగించి, తిరుగుబాటు వీరుల చరిత్రను చెరిపివేయాలన్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయకరణలను ప్రతిఘటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, విద్యార్థి ఉద్యమం కొత్త దిశగా ముందుకు సాగాలని పీ.డీ. ఎస్. యూ స్పష్టం చేసింది. ఇందుకోసం గత ఉద్యమాలను సమీక్షించుకుని, భవిష్యత్ కార్యాచరణకు దిశా నిర్దేశం చేసుకోవడానికి నవంబర్ నెలలో రాజమండ్రి పట్టణం వేదికగా 24వ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహాసభలను విద్యార్థులు జయప్రదం చేయాలని, మేధావులు, కర్షకులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతు అందించాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాను ప్రసాద్ , సహాయ కార్యదర్శి బి. సిద్ధూ, రాష్ట్ర నాయకులు నాగరాజు, రూప శంకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మెన్ గా పోతుగుంట రమేష్ నాయుడు.

**- బిజెపి పార్టీ నీ నమ్ముకుంటే ఉన్నత పదవులు.**

**- పోతుగుంట రమేష్ నాయుడు కు అభినందనలు తెలిపిన జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 18:** శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మెన్ గా ఎన్నికైన పోతుగుంట రమేష్ నాయుడు కు నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు అభినందనలు తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి నంద్యాల జిల్లా వేరుపడడంతో బిజెపి పార్టీ నీ బలోపేతం చేయడంలో ఆయన కృషి ప్రశంసనీయం.నంద్యాల జిల్లాలో అభిరుచి మధుకు కన్వీనర్ బాధ్యతలు ఇవ్వడంతో బిజెపి పార్టీలో నాయకులు,కార్యకర్తల్లో జోష్ నింపారు.జిల్లా వ్యాప్తంగా బిజెపి పార్టీ నీ బలోపేతం చేయడానికి పోతుగుంట రమేష్ నాయుడు విశేష కృషిచేశారు.జిల్లా వ్యాప్తంగా కమిటీలు,సభ్యత్వ నమోదు లక్ష్య చేయడానికి ఆయనవంతు కృషిచేశారు.అభిరుచి మధు కు సలహాలు సూచనలు ఇస్తూ పార్టీలో అందరిని కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషిచేశారు.నంద్యాల జిల్లాలో బిజెపి పార్టీ బలోపేతానికి కృషిచేయడంతో రాష్ట్ర పార్టీ గుర్తించడంతో పోతుగుంట రమేష్ నాయుడు కు శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మెన్ పదవి లభించింది.ఈ సందర్భంగా నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు మాట్లాడుతూ పార్టీకి చేసిన సేవలకు ఆయనకు మంచి పదవి లభించిందన్నారు.శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మెన్ పోతుగుంట రమేష్ నాయుడు కు రాష్ట్ర పార్టీకి అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

# పాఠశాల విద్యార్థులకు క్రీడా టీ-షర్టులు పంపిణీ చేసిన మాజీ జడ్పీటీసీ యామ గురప్ప.



**ఆంధ్ర ప్రగతి శిరివెల్ల సెప్టెంబర్ 18:** నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గం శిరివెళ్ళ మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల విద్యార్థుల ప్రోత్సాహానికి మాజీ జడ్పీటీసీ యామ గురప్ప ముందడుగు వేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని %-% విద్యార్థులకు ప్రత్యేకంగా క్రీడా టీ-షర్టులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా యామ గురప్ప మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.విద్యార్థులు క్రీడల్లో చురుకుగా పాల్గొనడం వల్ల శారీరక , మానసిక ఆరోగ్యం మెరుగవుతుందని తెలిపారు.జట్టు భావన, పోరాటపటిమ , క్రమశిక్షణ వంటి లక్షణాలు క్రీడల ద్వారా పెంపొందుతాయన్నారు. అందుకే ఈ క్రీడా టీ - షర్టులు అందజేస్తూ చిన్నారులకు ఉత్సాహం నింపుతున్నట్లు " తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న సహచర నేతలు , ఉపాధ్యాయులు , గ్రామ పెద్దలు యామ గురప్ప సేవా తత్పరతను అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి మంచి కార్యక్రమాలు మరిన్ని అవసరమని పేర్కొన్నారు. టీ - షర్టులు అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేసి, క్రీడలలో ప్రతిభ కనబరచి రాణిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక సహచర నాయకులు, పాఠశాల హెడ్ మాస్టర్, టీచర్లు, పాఠశాల సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని యామ గురప్పకు కృతజ్ఞతలు తెలిపారు.

# పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించిన ఎన్ఎండి ఫిరోజ్.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 18:** నంద్యాల పట్టణంలోని కూరగాయల మార్కెట్ ప్రాంగణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ 2025 కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా నంద్యాలను పరిశుభ్రంగా క్లీన్ గా ఉంచేందుకు అహర్నిశలు కష్టపడుతున్న పరిశుభ్రత కార్మికులను ఎన్ఎండి ఫిరోజ్ చేతులా మీదుగా ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల పరిశుభ్రత కోసం కార్మికులు చేస్తున్న సేవ అమూల్యమని ప్రతి పౌరుడు తన పరిసరాల పరిశుభ్రతకు బాధ్యత తీసుకోని క్లీన్ అండ్ గ్రీన్ నంద్యాలను సాధించడంలో ప్రతి ఒక్కరి సహకారం ఉండాలని పిలుపునిచ్చారు. కూరగాయల మార్కెట్‌లో గత పాలకులు కోట్లాది రూపాయలు వృధా చేస్తూ నిర్మించిన షెడ్డు నిరుపయోగంగా ఉందని, దానిని వ్యాపారులకు అనువుగా మార్చాలని మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. నంద్యాల మార్కెట్‌ను సమగ్రంగా అభివృద్ధి చేయడమే కాక, వ్యాపారుల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎన్ఎండి ఫిరోజ్ హామీనిచ్చారు.అదే విధంగా రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ చొరవతో తోపుడు బండ్ల వ్యాపారులపై ఎటువంటి పన్నులు లేదా గేట్లు వసూలు చేయరని, వారు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోవచ్చని తెలిపడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయన్న, కూరగాయల అండ్ ఫ్రూట్ మార్కెట్ కమిటీ సభ్యులు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్, టీడీపీ నాయకులు ఉప్పరి సురేష్ కుమార్, మల్లికార్జున, అన్వర్, ఆఫ్జల్ బాషా, శ్యాం సుందర్ గుప్తా, ఖాదర్ భాష, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరద ముప్పు నుండి ఉయ్యాలవాడ మండల గ్రామాల ప్రజలను రక్షించండి.

**తక్షణం కుందూ వరద ప్రవాహం తగ్గించి హరి నగరం గ్రామ ప్రజలకు రక్షణ కల్పించండి. -సిపిఎం జిల్లా కమిటీ.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా సెప్టెంబర్ 18:** ఆళ్లగడ్డ నియోజకవర్గం ఉయ్యాలవాడ మండలంలో ఈరోజు ఉదయం కురిసిన భారీ వర్షం ప్రభావంతో ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బంది పడుతున్న హరి నగరం గ్రామ ప్రజలకు వెంటనే రక్షణ కల్పించాలని, ఇళ్లలోకి నీరు చేరి తిండి వస్తువులు, ఇంటి సామాగ్రి పూర్తిగా తడిసి నష్టపోయిన కుటుంబాలకు ఆర్థిక సహాయం చేసి వారిని ఆదుకోవాలని సిపిఎం పార్టీ నంద్యాల జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్, కార్యదర్శి వర్గ సభ్యులు టి .రామచంద్రుడు, నరసింహ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రధానంగా ఈరోజు కురిసిన భారీ వర్షంతో పాటు, కుందూ నదిలో అధిక నీరు ప్రవహించడం వల్ల హరినగరం తో పాటు, కుందు సమీప గ్రామాలైన గుల్లదుర్తి, పొట్టిపాడు, కంప మల్లగ్రామాల్లో ప్రజానీకం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే కుందువెంట ఉన్నటువంటి అన్ని గ్రామాల్లోని పంట పొలాల్లో ఎక్కువ రోజులు నీరు పారి నిల్వ ఉండే నష్టం జరుగుతున్నది. కావున రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి ఉయ్యాలవాడ మండలంలోని గ్రామాల తో పాటు కుందు పరిసర గ్రామాలలోని ప్రజలను వరద ముప్పు నుండి రక్షించాలని, ఇప్పటికే ఇండ్లలోనీళ్లు చేరి నష్టపోయినటువంటి కుటుంబాలందరికి నష్ట పరిహారం అందించాలని, సమీప గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. అనేక సంవత్సరాల నుండి కుందూ నదిని పూడిక తీసి ఆధునీకరణ చేస్తామని, కుందు వెంట రైతులు నష్టపోకుండా మినీ ప్రాజెక్టులు నిర్మిస్తామని ప్రకటనలు ప్రచారాలు చేయడం తప్ప ఆచరణలో ప్రభుత్వాలు అమలు చేయకపోవడం వల్ల, రాయలసీమ జిల్లాలోని ఇతర ప్రాంతాలకు మరియు నెల్లూరు జిల్లాలకు కుందువెంట నీళ్లు తీసుకుపోయే క్రమంలో 30 వేల క్యూసెక్కుల వరకు నీళ్లు వదలడం తో పాటు అధిక వర్షపు నీరు తోడై కుందువెంట వరదలు వస్తున్నవి, రైతులు పంటలో నష్టపోతున్నారు. కావున సకాలంలో ప్రభుత్వాలు స్పందించి కుందువెంట గ్రామాల ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు సుధాకర్, కృష్ణమోహా న్ తదితరులు పాల్గొన్నారు.

# 6.29 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన రహదారిని పరిశీలించిన జిల్లా కలెక్టర్.

**గోరుకలు రిజర్వాయర్ రక్షణ పనులు నాణ్యతతో చేపట్టండి.**

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 18:** పాణ్యం నుండి గోరుకల్ రిజర్వాయర్ వరకు 6.29 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన రహదారి పనులను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం సాయంత్రం పరిశీలించారు. కొండజుటూరు, గోరుకల్ , ఎస్ కొట్టాల, దుర్వేసి గ్రామాలను కలుపుతూ 13.125 కి.మీ. పొడవున 6.29 కోట్ల రూపాయల వ్యయంతో పూర్తయిన రహదారి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ రహదారి నిర్మాణం వల్ల 4 గ్రామాలకు సులభ రవాణా సౌకర్యం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు సంబంధించి రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. రహదారి పనులు నాణ్యత ప్రమాణాలకు లోబడి, సమయానికి పూర్తయ్యేలా అధికారులు కృషి చేసారన్నారు.అనంతరం గోరుకల్లు రిజర్వాయర్ బండ్ పై చేపట్టిన రక్షణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ పనులకు 2.5 కోట్ల రూపాయల నిధులు డి ఎం ఎఫ్ ద్వారా మంజూరయ్యాయని, అందులో ఇప్పటివరకు 60 లక్షల రూపాయల విలువైన పనులు పూర్తయ్యాయని ఎస్ఆర్బిసి ఎస్ఈ శుభకుమార్ కలెక్టర్ కు నివేదించారు. రిజర్వాయర్ బండ్ పై రక్షణ పనులు పూర్తయితే నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, సాగు అవసరాలు తీర్చడంతో పాటు స్థానికులకు త్రాగునీటి సౌకర్యం చేకూరుతుందని కలెక్టర్ అన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు, సాగు నీరు, రవాణా సౌకర్యాలు కల్పించడమే ఈ పనుల ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల అమలులో ఎటువంటి జాప్యం చోటుచేసుకోకుండా త్వరితి గతిన పూర్తి చేసి ప్రజలకు ఉపయోగకరంగా మార్చాలని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

# నిత్యావసర సరుకుల పంపిణీ.... అభిమానం చాటుకున్న దాదా బ్రదర్స్.

## అభిమానం పేద వారికి ఆసరాగా నిలిచింది.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 18:** దాదా బ్రదర్స్ ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలోని పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి జన్మదినం సందర్భంగా దేవనగర్, శ్యామ్ నగర్ కు చెందిన పెద వారికి నిత్యావసర సరుకులు అందజేసిన దేవనగర్ బ్లడ్ దాదా, అతని సోదరుడు నజీర్ (కత్తి) , వారి మిత్రులు.నంద్యాల వైసిపి లీగల్ సెల్ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా ప్రజలకు నిత్యావసర సరుకులను అందించారు. ఈ సందర్భంగా దాదా బ్రదర్స్ సేవ భావంతో వారు చేస్తున్న పనులను అభినందించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రభ
తెలుగు దినపత్రిక
శుక్రవారం19 సెప్టెంబర్ 2025

## పోతుగుంట రమేష్ నాయుడుకు, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అభినందనలు.



**నంద్యాల జిల్లా సెప్టెంబర్ 18:** రాష్ట్రం లోని రెండవ ప్రముఖ దేవాలయంగా అభివృద్ధి చెందిన శ్రీశైల శ్రీ భ్రమరాంబ, మల్లికార్జున స్వామి పాలకమండలి చైర్మన్ గా ఎంపికైన పోతుగుంట రమేష్ నాయుడుకు గురువారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి శుభాకాంక్షలు తెలిపారు. అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన రమేష్ నాయుడును రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీశైల దేవస్థానం పాలకమండలి చైర్మన్ గా నియమిచడం మంచి పరిణామం అని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. మొదటి నుంచి రమేష్ నాయుడు ఆర్ ఎస్ ఎస్ లో చురుకైన కార్యకర్త, ఆర్ ఎస్ ఎస్ అనుబంధ విభాగాల్లో బాధ్యతగా పనిచేస్తూ నంద్యాల జిల్లా బీజేపీ ఇంచార్జిగా ప్రస్తుతం రమేష్ నాయుడు పనిచేస్తున్నారు. రమేష్ నాయుడు పర్యవేక్షణలో శ్రీశైల పుణ్య క్షేత్రం అభివృద్ధిలో ముందుకు సాగాలని కోరుకుంటున్నానని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

# శబరమ్మా మా ఇళ్లలోకి వరదనీరు వస్తోంది..

**భయపడవద్దు మీ వద్దకు అధికారులను పంపుతున్నా ఆధుకుంటాం. -నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వరద బాధితులకు భరోసా.**


**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా సెప్టెంబర్ 18:** శబరమ్మా మా ఊరును వరదనీరు చుట్టు ముట్టింది, మా ఇళ్లలోకి వరద నీరు చేరింది మమ్మల్ని ఆదుకోవాలని వరద భాధితులు ఫోన్ ద్వారా వరద నీటి ప్రవాహం, ఇళ్లలోకి వరద నీరు చేరిన దృశ్యాలు వీడియో కాల్ ద్వారా నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి తెలుపడంతో వెంటనే స్పందించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసి వరద బాధితుల వద్దకు పంపింది. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గం ఉయ్యాలవాడ మండలం హరివరం గ్రామంలో



గురువారం తెల్లవారుజామున కుండపోత వర్షం కురిచింది. దీంతో వరద నీరు భారీగా వచ్చి హరివరం గ్రామ ఎస్ సి కాలనీని చుట్టు ముట్టి ఇళ్లలోకి వరద నీరు చేరి నిరుపేదలకు చెందిన ధాన్యం, తిను బండారాలు, బట్టలు, వస్తువులు తడిచిపోయాయి. కొన్ని వరద నీటిలో కొట్టుకుపోయాయి. బాధితులకు దిక్కుతోచక వెంటనే గ్రామానికి చెందిన పెద్ద చంద్రుడు, చెన్నయ్యలు గురువారం తెల్లవారుజాముననే నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి వీడియో కాల్ ద్వారా ఫోన్ చేయగా ఆమె వెంటనే స్పందించి వరద ప్రవాహాన్ని, ఉధృతిని వీడియో కాల్ ద్వారా చూసి మీరు భయపడవద్దు, అధికారులు మీ వద్దకు వచ్చి సహాయ కార్యక్రమాలు చేస్తారన్న భరోసా ఇచ్చి వెంటనే అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసి హుటా హుటిన హరివరం గ్రామానికి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పంపి వరద భాదితులకు అండగా నిలిచారు. ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వెంటనే ఫోన్ ద్వారా స్పందించి అధికారులను పంపడం పట్ల గ్రామస్తులు, మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎయిడెడ్ స్కూళ్లలో టీచర్ ఉద్యోగాలు, డి.ఎస్.సి. ద్వారానే నియామకాలు చేపట్టాలి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 18:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న అన్ని ఎయిడెడ్ పాఠశాలల్లో టీచర్ ఉద్యోగాలు అవసరం లేకున్నా అడ్డదారిలో, అంగట్లో పప్పులు బెల్లాలుగా టీచర్ ఉద్యోగాలను లక్షల రూపాయలకు అమ్ముకుంటూ, సొమ్ము చేసుకుంటున్న ఎయిడెడ్ యాజమాన్యాలపై వారికి సహకరిస్తున్న ఆర్జేడీ, డీఈఓలపై కఠిన చర్యలు తీసుకోవాలని, గత మూడేళ్లలో చేపట్టిన నియామకాలను తక్షణమే రద్దు చేసి డి.ఎస్.సి ద్వారానే అర్హతలు కలిగిన వారిచే టీచర్ ఉద్యోగాలు చేపట్టాలని, స్థానిక బీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయ సమావేశంలో బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు కె సతీష్ కుమార్ తెలిపారు. జిల్లా అధ్యక్షులు కె సతీష్ కుమార్ మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా కడప ఆర్జేడీ కార్యాలయం, కడప డీఈఓ కార్యాలయం ఎదుట కొన్ని ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు ఎయిడెడ్ స్కూళ్లలో తప్పుడు మార్గాల్లో డబ్బులు వసూలు చేసుకొని, టీచర్ ఉద్యోగాలు ఇచ్చారని, విద్యాశాఖ అధికారులు మరియు ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు వారు కలిసి అడ్డదారిలో ఎయిడెడ్




స్కూళ్లలో చేపడుతున్న టీచర్ల నియామకం వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడడమే కాకుండా అత్యంత భారంగా చేస్తున్నారని ఆందోళనలు చేపడుతున్నారని తెలిపారు. గతంలో నంద్యాల ఎయిడెడ్ స్కూల్స్ వారు అభ్యర్థుల నుండి లక్షల రూపాయలు వసూలుచేసి మోసాలకు పాల్పడితే, డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరితే, గొడవ జరిగి కత్తులతో పోడుచుకోవడం దాకా వెళ్లిందని, అవసరం లేకున్నా తప్పుడు విద్యార్థుల రోల్ చూపి కమీషన్లకు కక్కుర్తిపడి విద్యాశాఖ అధికారులు అక్రమంగా పోస్టుల భర్తీ చేస్తున్నారని, నంద్యాలలో ప్రస్తుతం అడ్డదారిలో ఎయిడెడ్ స్కూళ్లలో చేపడుతున్న టీచర్ల నియామకాల కొరకు అభ్యర్థుల నుండి లక్షల రూపాయలు వసూలుచేసినట్లు ఆరోపణలున్నాయని ఆరోపించారు.
ఇంత బహిరంగంగా తప్పుడు మార్గాల్లో ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీ చేస్తున్న అంశంలో ప్రభుత్వం దృష్టి సారించి గత మూడేళ్లలో జరిగిన ఎయిడెడ్ టీచర్ల నియామకాలపై విచారణకు ఆదేశించి విద్యాశాఖ అధికారులపై మరియు ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయించి తగు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి బహుజన టీచర్స్ ఫెడరేషన్ విజ్ఞప్తి చేసింది. అంతేకాకుండా అడ్డదారిలో దొంగ టీచర్లు వస్తున్నారు కాబట్టే నిజాయితీగా పనిచేసే ప్రభుత్వ టీచర్లపై ఎన్నో నిందలు వస్తున్నాయి. కావున ఎయిడెడ్ స్కూల్లలో అడ్డదారిలో చేపడుతున్న టీచర్ల నియామకాలు రద్దు చేయాలని, టీచర్ల నియామకాలు డి.ఎస్.సి. ద్వారా మాత్రమే చేపట్టాలని, అర్హతలు కలిగిన వారికి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని సతీష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## మా ప్రాంతంలో బార్ అండ్ రెస్టారెంట్ పెట్టవద్దు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 18:** నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ లో ఉన్న మౌలానా ఆజాద్ సర్కిల్ దగ్గర ఒక బార్ అండ్ రెస్టారెంట్ తెరవడానికి సన్నాహాలు చేస్తున్నారని తెలుసుకొని సలీం నగర్ ప్రాంత పెద్దలందరూ కలిసి ఇక్కడ బార్ తెరవకూడదు అని, అబ్జెక్షన్ చేస్తూ, బార్ కు ఇచ్చిన పర్మిషన్ను క్యాన్సిల్ చేయాలని లేదా వేరే ఏ ప్రాంతంలో పెట్టుకోవాలని, నిరసన వ్యక్తం చేస్తూ మౌలాన అజాద్ సర్కిల్ నందు ధర్నా నిర్వహించారు.



వారు మాట్లాడుతూ ఈ ప్రాంతం నంద్యాల మొత్తం మీద స్వాతంత్ర సమరయోధుడు "మౌలాన అబుల్ కలాం ఆజాద్" పేరన ఉన్న ఏకైక ప్రాంతమని, ఇక్కడ ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు లేకుండా శాంతి నెలకొని ఉన్నదని, ఇది నివాస ప్రాంతమని, ఇక్కడ అనేక అపార్ట్మెంట్లు, స్కూళ్లు, అనేక హాస్పిటళ్ళు, బ్యాంకులు, హోటళ్ళు ఉండి ఈ ప్రాంతం చాలా రద్దీగా ఉంటుందని, రాత్రి 10 గంటల ఉదయం వరకు కుదూర ప్రాంతాలనుండి నంద్యాల నుండి చెన్నై, బెంగళూరు హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు వచ్చే ప్రయాణికులు ఇక్కడి నుండి బస్సులు ఎక్కుతూ ఉంటారని వారిలో ఎక్కువగా మహిళలు కూడా ఉంటారు అటువంటి ప్రాంతంలో బార్ పెట్టడం అసమంజసమని, కాబట్టి ఇక్కడ బార్ పెట్టే ఆలోచనను మానుకోవాలని అన్నారు. తరువాత వారు సబ్ కలెక్టర్ ని జిల్లా ఎక్సైజ్ డిపార్ట్మెంట్ ఆఫీసర్ను, మున్సిపల్ కమిషనర్ గారిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ చింపింగ్ బాసిత్, కార్పెంటర్ మౌలాలి, మౌలానా రహమతుల్లా, సర్దార్, అబులైస్ ,ఇక్బాల్ ఇంకా ఇతర మసీదు పెద్దలు పాల్గొన్నారు.

## ఎన్నికల కమిషన్ పని తీరుపై పౌరులు అవగాహన పొందాలి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 18:** ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్ పనితీరుపై శిక్షణా తరగతులు జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మ రెడ్డి సారాధ్యములో కర్నూలు నగరము లోని బ్రహ్మ రెడ్డి హాస్పిటల్ ఆ వరణములో జరగడం జరిగింది. ఈ శిక్షణా తరగతులకు నంద్యాల జిల్లా నుండీ, అనంతపురం జిల్లా నుండీ, కర్నూలు జిల్లా నుండీ ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా మరియు మండల భాద్యులు 35 మంది సభ్యులు పాల్గొనడం జరిగింది.
డాక్టర్. బ్రహ్మ రెడ్డి మాట్లాడుతూ నేడు దేశ వ్యాప్తంగా ఎన్నికల కమిషన్ పని



తీరుపై అనేక అనుమానాలు వచ్చే విధముగా ప్రవరించడం ఇది దేశ ప్రజాస్వామ్యనికి ప్రమాదం అనితెలుపుతూ ప్రజాస్వామ్య మును కాపాడుకోవాల్సిన భాద్యత భారత దేశంలో ని ప్రతి పౌరుడి భాద్యత. కావున మా ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక ద్వారా రాష్ట్ర వ్యాపితంగా జిల్లా ల వారిగా ఎన్నికల కమిషన్ పని తీరు పై ప్రజలకు అవగాహన, శిక్షణా తరగతులు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నింస్తున్నాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు రామ కృష్ణ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుమల్ల రహీమ్, అనంతపురం నుండీ జిల్లా అధ్యక్షులు అల్తాఫ్,, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబ శివుడు, జిల్లా కోశాధికారి టి వి రెడ్డి,, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సత్య నారాయణ, కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్, జిల్లా కోశాధికారి గద్వాళా ఈరన్న జానవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి శేషాద్రి రెడ్డి మరియు ఐక్య వేదిక సభ్యులు పాల్గొన్నారు.

## భూ సేకరణ ప్రక్రియలోని పెండింగ్ అంశాలను వేగవంతంగా పరిష్కరించండి.

**-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 18:** నంద్యాల జిల్లాలో వివిధ పరిశ్రమలు, విద్యాసంస్థలు, సంక్షేమ వసతి గృహాల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రెవిన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్లో జరిగిన సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, డిఆర్ఓ,



ఆర్డీఓలు, సంబంధిత మండల తహసీల్దార్లు, తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, సామాజిక మౌలిక సదుపాయాల విస్తరణలో భూసేకరణ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేత్రస్థాయిలో రైతులు, అసైన్దారులతో సమన్వయం చేసుకొని స్పష్టమైన నివేదికలు పంపాలని జాయింట్ కలెక్టర్, సంబంధిత రెవిన్యూ అధికారులను ఆమె ఆదేశించారు.ఇప్పటి వరకు జిల్లాలో కుసుం ప్రాజెక్టు కోసం మిద్తూరులో 162 ఎకరాలు, కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రాజెక్టుల కోసం రుద్రవరం, చాగలమరి, ఆళ్లగడ్డ ప్రాంతాల్లో కలిపి 315 ఎకరాలు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ కోసం డోన్, బేతంచర్లలో 2,860 ఎకరాలు, ఎంఎస్ఎంఈ ప్రాజెక్టు కోసం సుగాలిమెట్టలో 49 ఎకరాలను కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలో భూసేకరణకు సంబంధించి పెండింగ్లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించి, పెట్టుబడులు, పరిశ్రమలు సజావుగా సాగేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను సూచించారు. పరిశ్రమలతో పాటు విద్యా, సంక్షేమ రంగాలు ముందుకు సాగాలంటే సమయపాలనతో, సమన్వయంతో అధికారులు పనిచేయాలని ఆమె పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీఓలు విశ్వనాథ్, నరసింహులు, నాగజ్యోతి, సంబంధిత మండల తాసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 అంగీకార్ - 2025 బ్రోచర్ ఆవిష్కరణ.

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 18:** భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 అంగీకార్ - 2025 బ్రోచర్ను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆవిష్కరించారు. గురువారం తన చాంబర్ లో మున్సిపల్ కమిషనర్ శేషన్న, హౌసింగ్ పిడి శ్రీహరి గోపాల్ తో కలిసి అంగీకార్ బ్రోచర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఇల్లు లేని ప్రతి అర్హత గల కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడం ఈ పథకం ప్రధాన లక్ష్యమని



పేర్కొన్నారు. స్థానిక ఆధార్, రేషన్ కార్డు కలిగి, ఎం బి ఎం పోర్టల్లో అర్హులుగా గుర్తింపు పొందిన వారికి పీఎం ఏవై (యు)-ఎన్టీఆర్ నగర్ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం 1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయలు కలిపి 2.5 లక్షల రూపాయల సబ్సిడీ అందిస్తున్నాయని కలెక్టర్ చెప్పారు. దేశంలో ఒక్క అర్హుడైనా ఇల్లు లేకుండా ఉండకూడదన్న సంకల్పంతో అంగీకార్ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. సెప్టెంబర్ 4న ఢిల్లీలో జాతీయ స్థాయిలో ఈ కార్యక్రమం ప్రారంభమైందని, పి ఎం ఏ వై(యు) 2.0 ప్రారంభించి సంవత్సరం పూర్తయిన సందర్భంలో సెప్టెంబర్-అక్టోబర్ నెలలను "హౌసింగ్ నెలలు"గా నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అంగీకార్ - 2025 ప్రచారంలో భాగంగా ఇల్లు లేని పేదలను గుర్తించి గృహ యజమానులుగా చేయడం, బ్యాంక్ లోన్ సౌకర్యం కల్పించడం, రిజిస్ట్రేషన్ చేయించడం, పీఎం సూర్యకర్ యోజన లో లబ్ధిదారులను ప్రోత్సహించడం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడం ప్రధాన అంశాలుగా కొనసాగనున్నాయని కలెక్టర్ వివరించారు.

## పోతుగుంట రమేష్ నాయుడు కు నంద్యాల జనసేనపార్టీ తరపున అభినందనలు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 18:** రాష్ట్రం లోని రెండవ ప్రముఖ దేవాలయంగా అభివృద్ధి చెందిన శ్రీశైల శ్రీ భ్రమరాంబ, మల్లికార్జున స్వామి పాలకమండలి చైర్మన్ గా ఎంపికైన పోతుగుంట రమేష్ నాయుడుకు జనసేన పార్టీ తరపున నంద్యాల జనసేన పార్టీ నాయకులు దండు మురళీకృష్ణ ,మరాచు గురుబాబు, జనసేన రాము, పత్రికా ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన రమేష్ నాయుడు ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భాజపా రాష్ట్ర




అధ్యక్షుడు పి.వి.ఎన్.మాదవ్ లు శ్రీశైల దేవస్థానం పాలకమండలి చైర్మన్ గా నియమిచడం మంచి పరిణామం అని జనసేన పార్టీ నాయకులు దండు మురళీకృష్ణ ,మరాచు గురుబాబు, పేర్కొన్నారు మొదటి నుంచి రమేష్ నాయుడు ఆర్ ఎస్ ఎస్ లో చురుకైన కార్యకర్త, ఆర్ ఎస్ ఎస్ అనుబంధ విభాగాల్లో బాధ్యతగా పనిచేస్తూ నంద్యాల జిల్లా బీజేపీ ఇంచార్జిగా ప్రస్తుతం రమేష్ నాయుడు పనిచేస్తున్నారు. రమేష్ నాయుడు పర్యవేక్షణలో శ్రీశైల పుణ్య క్షేత్రం అభివృద్ధిలో ముందుకు సాగాలని కోరుకుంటున్నామని తెలిపారు.

# ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మరమ్మత్తులు.

**పైప్ లైన్ కోసం ప్రతిపాదనలు.**

**ఈవో అశ్విని కుమార్.**

**శిరివెళ్ళ సెప్టెంబర్ 18ఆంధ్ర ప్రగతి:** మండల పరిధిలోని యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో ఇటీవల ప్రధాన రహదారిలో కల్వర్టు వద్ద రోడ్డు కుంగి పోవడం వల్ల ప్రజల రాకపోకలకు తీవ్ర అవస్థలు ఇబ్బందులు ఎదురైన సంఘటనను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దృష్టికి తీసుకు వెళ్లడంతో వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించినట్లు ఈవో అశ్విని కుమార్ పేర్కొన్నారు.
ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎంపీడీవో సి శివ మల్లేశ్వరప్ప ఇతర అధికారులు ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈవో



అశ్విని కుమార్ తక్షణ చర్యలలో భాగంగా మరమత్తు పనులు వేగవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఈవో అశ్విని కుమార్ మాట్లాడుతూ యర్రగుంట్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో గ్రామీణ నీటి సరఫరా పథకంలో భాగంగా పైప్ లైన్ వేసి పబ్లిక్ ట్యా ప్ ల ద్వారా నీటిని అందించేందుకు అవసరమయ్యే నిధులకు సంబంధించి ప్రతిపాదనలు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దృష్టికి తీసుకు వెళ్లినట్లు పేర్కొన్నారు.
ఎస్సీ కాలనీలో ఎన్నో సంవత్సరాల నుండి మినీ ట్యాంకులు మినహా పైప్ లైన్ లేకపోవడం పట్ల కాలనీ ప్రజలు పలుమార్లు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. సదరు సమస్యను ఎమ్మెల్యే ఆదేశిస్తే నీటి సరఫరా అందించే పైప్ లైన్ సమస్య తీర్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఈఓ పేర్కొన్నారు.

# అసెంబ్లీకి రాని నేతలు అవసరమా ?

**అమరావతి సెప్టెంబర్ 18 ఆంధ్ర ప్రగతి :** తెలుగు రాష్ట్రాల్లో చాలా విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా అధికారం కోల్పోవడంతో విమర్శలే లక్ష్యంగా విపక్షంలో ఉన్న పార్టీలు వ్యవహరిస్తున్నాయి. ప్రతిపక్షహోదా ఇస్తే తప్ప అసెంబ్లీకి రానని ఎపిలో విపక్ష వైకాపా అధినేత జగన్ మొండిపట్టుతో ఉన్నారు. విపక్ష హోదా ఇవ్వండి అసెంబ్లీకి వస్తానని అంటున్నారు. ఇక తెలంగాణలో విపక్ష హోదా ఉన్నా కెసిఆర్ అసెంబ్లీకి రావడం లేదు. అధికారం ఉంటే తప్ప అసెంబ్లీలో అడుగు పెట్టేది లేదన్న ధోరణిలో ఉన్నారు. ప్రజలు ఎమ్మెల్యేగా ఎన్నుకున్న తరవాత అసెంబ్లీకి రావాల్సిందే. సమస్యలపై చర్చించాల్సిందే. అలా కాకండా జీతభత్యాలు మాత్రం ఠంచనుగా ఎత్తుకుంటున్నారు. ప్రజల సొమ్ము తింటున్న ఈ ఇద్దరు నేతలు ఇంత బాధ్యతారహితంగా ఉంటున్నారు. ఇలాంటి సమయాల్లో చట్టప్రకారం ఏం చేయాలన్నది ఆలోచన చేయాలి. ఇలాంటి వారిపై కొరడా ఝులిపిం చాలి. వారిని ఎమ్మెల్యేలుగా అనర్హులను చేయాలి. మళ్లీ ఎన్నుకోకుండా చూడాలి. ఇకపోతే అధికారంలో ఉండగా అప్పులు చేసి, విభజిత ఆంధ్రప్రదేశ్‌ను ఈ ఇద్దరూ కలిసి అప్పుల ఊబిలోకి నెట్టారు. ఇప్పుడేమో ఉన్న ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయని గగ్గోలు పెడుతున్నారు. నిజానికి వీరు ఎందుకు అప్పులు చేశారు.. ఎందుకు దివాళా తీయించారన్న దానికి సమాధానం లేదు. దేశంలో బహుశా ఇంతగా అప్పుల బారినపడ్డ రాష్ట్రాలు లేవేమో. అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆర్థిక క్రమశిక్షణను పాటించలేదు. దీంతో ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తూ అనుత్పాదక రంగాలకు విపరీతంగా దుబారా చేసారు. వీటినే అభివృద్ధి, సంక్షేమం అంటూ ఓటు బ్యాంకును పటిష్టం చేసుకునే పనిలో ఉన్నాయి. ఆర్థిక క్రమశిక్షణతో పాటు, రాజకీయ క్రమశిక్షణ కూడా పాటించకుంటే మట్టి కరచిపోతాయని గతంలో అనేక సందర్భాల్లో చూశాం. ప్రధానంగా అభివృద్ధి పేరుతో చేస్తున్న డబ్బు పందేరాలు రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. ఈ అప్పుల నుంచి బయటపడే మార్గాలు కూడా కనిపించడం లేదు. అలాగే అభవృద్ది పూర్తిగా కుంటుపడింది. ఇరు తెలుగు రాష్ట్రాల్లో విపక్షాలను దెబ్బతీయడం, విమర్శలను సహించక పోవడం వంటి చర్యలతో ఇద్దరు సిఎంలు నిరంకుశంగా పనిచేయడం ద్వారా తెలుగు రాష్ట్రాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అలాంటి రాష్ట్రాలను గాడిలో పెట్టాల్సిన ప్రస్తుత సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు మరిన్ని అప్పులు చేస్తున్నారే తప్ప ఆలోచన చేయడం లేదు. ఎపిలో జగన్ ప్రభుత్వం విపక్షాలను అణచివేయడం, కేసులు పెట్టడంలో ప్రత్యేక శ్రద్ద తీసుకోవడంతో ప్రజల్లో పలచన అయి, అధికారం కోల్పోయి, అసెంబ్లీకి రానని మంకు పట్టుతో ఉన్నారు. పార్టీలను అణగదొక్కడంలో కెసిఆర్ చేసిన కృషి ఇప్పుడు ఆయనకే ఎదురు తిరిగింది. కాంగ్రెస్‌ను నామరూపాలు లేకుండా చేయాలన్న కుట్రతో చేసిన ప్రయత్నాలు బెడిసి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా చేశారు. దీంతో ఆయనా అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేశారు. కాంగ్రెస్, బిజెపిలు తెలంగాణలో ఉనికి లేకుండా పోవాలని కెసిఆర్ వేసిన ఎత్తుగడలు ఫలించలేదు. వారి దెబ్బకు




బిఆర్ఎస్ ఉనికిలేకుండా పోయింది. ఇలాంటి రాజకీయ నేతలు అవసరమా అన్నది ప్రజలు ఆలోచనచేయాలి. నిజాయితీ లేని రాజకీయ నేతలను పక్కన పెట్టడం నేర్చుకోవాలి. అసెంబ్లీకి రాని నేతలు ప్రజలకు ఏం సేవ చేస్తారో చూస్తున్నాం. అధికారంలో ఉన్నా మేలు చేయలేదు. విపక్షంలో ఉన్నా మేలు లేదని కెసిఆర్, జగన్‌లు నిరూపించారు. బెంగాల్లో కమ్యూనిస్టులు ఇదే ధోరణిలో 30 ఏళ్లపాటు రాజ్యమేలారు. తమకు తిరుగు లేదన్న ధోరణిలో వారు ప్రజల ఆశలను,ఆకాంక్షలను పట్టించుకోలేదు. తమ నిరంకుశ పాలనకు ప్రజాస్వామ్యం, అభివృద్ధి ముసుగేసారు. కానీ అక్కడా మమతా బెనర్జీ లాంటి వారు పుట్టుకుని వచ్చారు. కమ్యూనిస్టులను కూకటి వేళ్లతో పెకిలించారు. అయితే ఆమె కూడా ఇప్పుడు అదే ధోరణిలో నిరంకుశ పాలన సాగించడంతో ఇప్పుడు మమతా బెనర్జీ పునాదులు కూడా కదులుతున్నాయి. బిజెపి అక్కడ చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు పలుకుతున్నారు. నిరాశా నిస్పృహలతో ఉన్న మమతా బెనర్జీ బిజెపి నేతలపై దాడులకు దిగుతోంది. ప్రజాస్వామ్యంలో నిరంకుశ విధానాలను ఎవరు అవలంబించినా పతనం తప్పదు. అది గుర్తించకపోతే మనుగడ సాగించడం కూడా అంతే కష్టం. ప్రజల మనసెరిగి ముందుకు సాగితే ఎంతకాలమైనా ప్రజలు ఆదరిస్తారు. తెలంగాణల కూడా తొలుత తెలుగుదేశం పార్టీని, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీని కోలుకోకుండా దెబ్బతీసిన కేసీఆర్, ఇప్పుడు ప్రతిపక్ష పాత్రకే పరిమితం అయ్యారు. ఇలాంటి దుస్తితి ఎదుర్కోవాల్సి వస్తుందిన ఊహించి ఉండక పోవచ్చు. పశ్చిమబెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఏ తప్పు చేశారో తెలంగాణలో కూడా కేసీఆర్ అదే తప్పు చేసారు. పశ్చిమ బెంగాల్‌లో బలంగా ఉన్న వామపక్షాలను మమతా బెనర్జీ బలహీనపరిచారు. ఎపిలో కూడా జగన్ టిడిపిని తిట్టడం,కేసులు పెట్టడం, లేపేయడం వంటి చర్యలకు ప్రోత్సాహం ఇవ్వండం తో ప్రజలు తిరిగి టిడిపిని ఎన్నుకున్నారు. ప్రజలు మెచ్చేలా పాలన అందించినంతవరకు పాలక పార్టీకి దిగులు లేదు. అయితే ఇది విస్మరించి వ్యహరించడంవల్ల ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జగన్, కెసిఆర్‌లు గడ్డు పరిస్థితులను ఎదుర్కొం టున్నారు. వారు అసెంబ్లీకి వచ్చి తమ హయాంలో మంచిచేస్తే మంచిని చెప్పాలి. విపక్షంగా ప్రజల పక్షాన పోరాడాలి. సమస్యలపై నిలదీయాలి. కానీ అధికార పక్షం ఎదురుదాడిని తట్టుకోలేక భయంతో అసెంబ్లీకి ముఖం చటేస్తున్నారు. ఇప్పుడు భారతీయ జనతాపార్టీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోంది. బీజేపీ ఇంతలా బలం పుంజుకోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రజల్లో నిరసనలు నివురుగప్పితే నాయకుడు ఏ పార్టీలో అయినా పుట్టుకుని వస్తారని గమనించడంలేదు. బిఆర్ఎస్ పార్టీలో ప్రజాస్వా మ్యాన్ని మచ్చుకు కూడా కనిపించకుండా అంతా తామే అన్నట్టుగా కెసిఆర్, కెటిఆర్ వ్యవహారాలు నడిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. అసెంబ్లీకి వెళ్లకుంటే నష్టపోయేది జగన్, కెసిఆర్‌లు మాత్రమేనని గుర్తించాలి.


# సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు అసాధ్యం

**రాహుల్ విమర్శలను ఖండించిన ఇసి**

**అబద్దాల ప్రచారంతో అస్థిరత సృష్టించే యత్నం**

**రాహుల్ విమర్శలపై మండిపడ్డ బిజెపి నేతలు**

న్యూఢిల్లీ, **సెప్టెంబర్ 18 ఆంధ్ర ప్రగతి :**ప్రత్యేక సాఫ్ట్‌వేర్ వాడి ఓట్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన విమర్శలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. అదంతా నిరాధార, అసత్య ప్రచారమని వెల్లడించింది. ఆన్‌లైన్ వేదికగా ఓట్లను తొలగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వకుండా ఏ ఒక్కరి ఓటు తొలగించడం లేదు.. ఆన్‌లైన్‌లో మరెవరూ తొలగించలేరని కూడా వివరించింది. 2023లో అలంద్ అసెంబ్లీ నియోజవర్గంలో ఓటర్ల తొలగింపునకు విఫల ప్రయత్నాలు జరిగాయి. ఆ వ్యవహారంపై దర్యాప్తు కోసం ఎన్నికల సంఘమే ఫిర్యాదు చేసింది. రికార్డుల ప్రకారం.. అలంద్




అసెంబ్లీకి 2018లో జరిగిన ఎన్నికల్లో భాజపా అభ్యర్థి విజయం సాధించారు. 2023లో కాంగ్రెస్ నేత బీఆర్ పాటిల్ గెలుపొందారని ఈసీ వెల్లడించింది. ఇలా తొలగంపు అన్నది జరగదని కూడా ఇసి స్పష్టం చేసింది. ఇదిలావుంటే ఓట్ల తొలగింపు అంటూ రాహుల్ తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని భాజపా దుయ్యబట్టింది. రాహుల్‌కు రాజ్యాంగం, చట్టం అర్థం కావడం లేదు. 2014 నుంచి మోదీజీ సాధిస్తున్న విజయాలన్నీ నిజం కాదని ఆయన ఆరోపిస్తున్నారు. ఈ వ్యాఖ్యలు దేశ ప్రజలకు, ఓటర్లకు అవమానం. ఆయన బాంబు గురించి మాట్లాడుతున్నారు. ఈ ప్రకటనలను తీవ్రంగా ఖండిస్తున్నాను అని మాజీ కేంద్రమంత్రి రవిశంకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హైడ్రోజన్ బాంబు పేలుస్తామని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు. ఆ బాంబ్ ఇలాగే ఉంటుందా..? వాళ్లు ఓటమిని చవిచూస్తున్నారు. ఈ సమయంలో వారు చేయాల్సింది దానిని అంగీకరించడం. కష్టపడి మీ స్థాయికి వస్తామనేలా వారి మాటలు ఉండాలి. అంతేకానీ దానికి బదులుగా వారు కోర్టుల జోక్యాన్ని కోరుకుంటున్నారు. లేకపోతే వేరొకరిపై నిందలు వేస్తున్నారని ఢిల్లీ మంత్రి మజీందర్ సింగ్ సిర్సా మండిపడ్డారు. బంగ్లాదేశ్, నేపాల్ తరహా అశాంతి భారత్‌లో సృష్టించాని రాహుల్ భావిస్తున్నారని కమలం పార్టీ నేత అనురాగ్ ఠాకూర్ విమర్శించారు. రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దాదాపు 90 ఎన్నికల్లో ఓటమి చవిచూసిందని, దాంతో ఆయన అసహనం రోజురోజుకూ పెరుగుతోందని ఎద్దేవా చేశారు. క్షమాపణలు కోరడం, కోర్టు మందలింపులు ఆయనకు పరిపాటిగా మారిపోయాయని అన్నారు.

## కాకులకే ఎందుకు పిండం పెట్టాలి ?



తిరుమల **సెప్టెంబర్ 18 ఆంధ్ర ప్రగతి :** మహాలయంలో అంటే పితృపక్షాల సమయంలో మనం కాకులకు ఆహారం ఎందుకు పెడతాము? మన పూర్వీకులు కాకులుగా మారారా? అయితే ఇంతటి అల్ప పక్షిగా ఎందుకు మారారు? ఏదైనా పెద్ద స్థాయిలో ఉన్న పక్షిగా ఎందుకు మారలేదు?'అని భక్తుడొకరు పరమాచార్య స్వామివారిని అడిగాడు. స్వామివారు ఒకసారి చిరునవ్వి, 'తమిళంలో మనం కాకిని 'కాకా' అని పిలుస్తాము. ఇక ఏదైనా ప్రాణిని మనం అవి చేసే శబ్దాలతో పిలుస్తామా? పిల్లిని 'మ్యావ్' అని, చిలుకలు కికి అంటాయి కాబట్టి వాటిని 'కికి' అని పిలుస్తామా? లేదు! కాకిని దాని అరుపుతో పిలుస్తాము. అదే దాని ప్రత్యేకత. క అంటే కాపాత్తు (కాపాడు), రక్షించు అని అర్థం. కనుక నువ్వు కాకికి ఆహారం పెట్టి 'కా కా' అని పిలిస్తే, కాపాడు అని పితృదేవతలని అడిగినట్టు!విరివిగా ఉంటాయి, ఏది పడితే అది తింటాయి కాబాట్టి కాకిని నువ్వు అల్పపక్షి అంటున్నావు. కాకి ఎంత గొప్పదో ఇప్పుడు చెబుతాను విను. అది బ్రహ్మముహూర్తంలో లేస్తుంది. కా కా అని అరచి నిన్ను నిద్రలేపుతుంది. ఒక్కోసారి కోళ్ళు సరిగ్గా సమయానికి లేవవు. కాని కాకి సరైన సమయానికి లేస్తుంది. అది కాకా అని అరుస్తూ నీ జపానికి సరైన సమయమైన బ్రహ్మముహూర్తంలో నిన్ను నిద్రలేపుతుంది.అది పూజకు సరైన నిర్దేశం. అంతేకాక, దానికి ఆహారం దొరికితే ఇతర కాకులను పిలుస్తుంది. ఆహారాన్ని పంచుకుని తినండి అని మనకు తెలిపే వేరే ప్రాణుల్లో కనపడని ఒక ప్రత్యేకక లక్షణం కలిగినది. మరలా సాయంత్రం నిద్రకు ఉపక్రమించే ముందు, మరలా కాకా అని అంటుంది. ఆ రోజు జరిగిన అన్ని విషయాలకు భగవంతునికి కృతజ్ఞతగా. అలాగే, కాకులు సూర్యాస్తమయం తరువాత ఏమీ తినవు. ఇది శాస్త్రములు చెప్పిన ఉత్తమమైన విషయం కూడా. ఇది ఎంతమంది పాటిస్తున్నారు?కనుక నాకు తెలిసి కాకి అల్ప ప్రాణి కాదు. అది మనకు ఎంతో నేర్పుతుంది. అందుకే పితృ దేవతలు కాకి రూపంలో వస్తారు. మరొక్క విషయం.. కేవలం మహాలయం లోనే కాదు, ప్రతిరోజూ కాకికి ఆహారం పెట్టు. కాకి మనకు అద్వైతాన్ని కూడా నేర్పుతుంది.నువ్వు పెట్టిన ఆహారాన్ని చూడగానే కాకి ఎంతో సంతోషపడి ఆ ఆహారాన్ని స్వీకరిస్తుంది. అది తినడం చూడడం వల్ల నువ్వు కూడా ఆనందాన్ని పొందుతావు. కనుక ఇరువురు ఆనందంగా ఉంటారు. ఇద్దరూ భగవత్ స్వరూపులే! అని తెలిపారు.

# బంగ్లా చొరబాటు దారులకు అండ

**ఓట్లచోరీ ఆరోపణల వెనక ఇదే లక్ష్యం**


**రాహుల్ తీరుపై మండిపడ్డ అమిత్ షా**

పాట్నా, **సెప్టెంబర్ 18 ఆంధ్ర ప్రగతి :**ఓట్ల చోరీ అంటూ 'ఇండియా' కూటమి తప్పుడు ఆరోపణలు చేస్తోందని కేంద్ర మంత్రి అమిత్ షా విమర్శించారు. భాజపా అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను తొలగిస్తుందని గతంలో ఇదే తరహా దుష్ప్రచారం చేసిందన్నారు. బిహార్‌లోని డెహరీ ఆన్ సోన్‌లో పార్టీ శ్రేణులతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ మేరకు మాట్లాడారు. బంగ్లాదేశీ చొరబాటుదారులను రక్షించడమే లక్ష్యంగా రాష్ట్రంలో ఇటీవల రాహుల్ గాంధీ యాత్ర నిర్వహించారని ఆరోపించారు. ఒకవేళ ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే.. రాష్ట్రమంతా చొరబాటు-దారులతో నిండిపోతుందని వ్యాఖ్యానించారు. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన చొరబాటుదారులను రక్షించడమే రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర' ప్రధాన ఉద్దేశం. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ తిరుగుతూ.. 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే బిహార్ చొరబాటు-దారులతో నిండిపోతుందని చెప్పండి. అదేవిధంగా 'ఓట్ల చోరీ' అంటూ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టండి. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను రద్దు చేయడానికి భాజపా యత్నిస్తుందని గతంలో ఇదే తరహా ఆరోపణలు చేశారు. కానీ.. అలాంటిదేమీ జరగలేదు కదా' అని కాషాయ శ్రేణులను ఉద్దేశించి అమిత్ షా పేర్కొన్నారు. బిహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు అమిత్ షా ఈ పర్యటన చేపట్టారు. మగధ-శాహాబాద్ ప్రాంతంలోని 10 జిల్లాల నేతలతో సమావేశమయ్యారు. 2020 అసెంబ్లీ ఎన్నికలు, గత ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ ఎన్డీయే పనితీరు అంతంతమాత్రంగానే ఉండటంతో ప్రత్యేక దృష్టి సారించినట్లు- సమాచారం. అంతకుముందు సీఎం నీతీశ్ కుమార్ పాట్నాలో అమిత్ షాను కలిశారు. తాను ఎన్డీయేలోనే ఉంటానని ఇటీ-వల ప్రధాని మోదీ సమక్షంలో నీతీశ్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

## రెవెన్యూ కోర్టు కేసులు

# ఆన్‌లైన్ పరిధిలోకి

అమరావతి, **సెప్టెంబర్ 18 ఆంధ్ర ప్రగతి :**




రాష్ట్రంలో రెవెన్యూ కోర్టుల్లో ఏయే కేసులు పెండింగ్‌లో ఉన్నాయి? ఎన్ని పరిష్కారానికి నోచుకోలేదు? అన్నది త్వరలో తేలనుంది. వాటి వివరాలను రెవెన్యూ శాఖ ఆన్‌లైన్‌లోకి తీసుకొస్తోంది. ఇనాం డీటీ, ఆర్‌డీఓ, జాయింట్ కలెక్టర్, అప్పీల్స్ కమిషనర్, సెటిల్‌మెంట్ కమిషనర్, ఇంకా రెవెన్యూ స్పెషల్ సీఎస్, రెవెన్యూ మంత్రి వద్ద ఉండే కోర్టుల్లోని డేటా అంతా రెవెన్యూ కోర్టు మేనేజ్‌మెంట్ సిస్టం(ఆర్‌సీఎమ్ఎస్)లోకి తెస్తోంది. ఇనాం రద్దు చట్టం-1957 పరిధిలోని క్లెయిమ్‌లు ఇనాం డీటీల వద్ద భారీగా పెండింగ్‌లో ఉంటున్నాయి. జిల్లాల వారీగా ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి? ఇప్పటి వరకు ఎన్ని కేసులు పరిష్కరించారు? అప్పీళ్ల దశలో ఉన్న కేసులు ఎన్ని? అన్న సమాచారం రెవెన్యూ శాఖ వద్ద స్పష్టంగా లేదు. ఆయా జిల్లాల్లో కూడా సరైన డేటా లేదు. పలుకుబడి ఉన్న, రాజకీయ ఒత్తిళ్లతో ముడిపడిన ఇనాం కేసులే త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయి. ఆ కేసుల్లో ఏం తీర్పులు ఇచ్చారో కూడా రికార్డులు అందుబాటులో ఉండటం లేదు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ భూమి హక్కులు, పట్టాదారు పాసుపుస్తక చట్టం(రికార్డ్ ఆఫ్ రైట్స్-ఆర్ఓఆర్)-1957 కేసులు ఇంతకుముందు జిల్లా స్థాయిలో ఆర్‌డీఓలు చూసేవారు. ఆ తర్వాత ఆ అధికారం డీఆర్ఓలకు అప్పగించారు. ఇప్పుడు మళ్లీ ఆర్‌డీఓలకే అప్పగిస్తూ చట్టసవరణ చేశారు. ఈ నేపథ్యంలో ఇకపై ఇనాం, ఆర్ఓఆర్ కేసుల వివరాలన్నీ ఆర్‌సీఎమ్ఎసలోకి అప్‌లోడ్ చేయాలని భూపరిపాలనా ప్రధాన కమిషనర్ జి.జయలక్ష్మి ఇటీవల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లాల వారీగా భారీగా అసైన్డ్ చట్ట ఉల్లంఘన కేసులున్నాయి. వీటిని తహసీల్దార్, ఆర్‌డీఓ, జేసీలు చూస్తున్నారు. ఎవరి స్థాయిలో ఎన్ని కేసులున్నాయి? వాటి తాజా పరిస్థితి ఆర్‌సీఎమ్ఎసలోకి అప్‌లోడ్ చేయాలని జయలక్ష్మి ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటి వరకు అన్ని జిల్లాల్లో కలిపి 10,142 కేసుల వివరాలను ఇందులో అప్‌లోడ్ చేసినట్లు తెలిసింది. అసైన్డ్ చట్టం పరిధిలోకి వచ్చేవి 523, ఆర్ఓఆర్ చట్టానికి సంబంధించినవి 9,489 కేసులను అప్‌లోడ్ చేశారు. ఇందులో కొత్తగా భూ కబ్జాలకు సంబంధించిన కేసుల డేటాను కూడా కలుపుతున్నారు. జిల్లాల్లో ఉన్న అన్ని భూ వివాదాల కేసులను పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేయించాలని సీసీఎల్ఏ ఆదేశాలు జారీ చేశారు.

# మార్షల్స్ తీరు సరికాదు

**హడావిడి వ్యవహారాలపై లోకేశ్ ఆగ్రహం**

అమరావతి, **సెప్టెంబర్ 18 ఆంధ్ర ప్రగతి :**ఏపీ అసెంబ్లీ లాబీల్లో మార్షల్స్ అతిప్రవర్తనపై ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చాంబర్ నుంచి మంత్రి లోకేష్ బయటకు వస్తున్న సమయంలో.. లాబీల్లో ఇతరులను తప్పుకోండి అంటూ మార్షల్స్ హడావుడి చేశారు. సభ్యుల వ్యవహారాల్లో మీకేం పని అంటూ మంత్రి లోకేష్ ప్రశ్నించారు. ఇంకా తాడేపల్లి ప్యాలెస్ పాలనలో ఉన్నామనుకుంటు న్నారా అంటూ చురకలు అంటించారు. బయటి వ్యక్తులు లోపలకు రాకుండా చూసుకోవాలి కానీ.. ఎమ్మెల్యేల వ్యవహారంలో జోక్యం చేసుకోవద్దని మార్షల్స్‌కు లోకేష్ హితవు పలికారు. గురువారం ఉదయం తొమ్మిది గంటలకు ఏపీ అసెంబ్లీ, పది గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభమయ్యాయి. అసెంబ్లీకి వచ్చే ముందు వెంకటపాలెంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి సీఎం నారా చంద్రబాబు నాయుడు, టీ-డీపీ ఎమ్మెల్యేలు నివాళులు అర్పించారు. కార్మిక, పరిశ్రమలు, మోటార్ వాహనాలు, ఎస్టీలకు సంబంధించి అసెంబ్లీలో 8 చట్ట సవరణ బిల్లులు ప్రవేశపెట్టనుంది ఏపీ ప్రభుత్వం. అసెంబ్లీలో చర్చించేందుకు 22 అంశాలను సిద్ధం చేసింది ఏపీ ప్రభుత్వం.

## విమాన రెక్కల్లో ఇరుక్కు పోయిన పక్షి

**చాకచక్యంగా కిందకు దింపిన పైలట్**

విశాఖపట్నం, **సెప్టెంబర్ 18 ఆంధ్ర ప్రగతి :** ఈ మధ్యకాలంలో పలు విమానాలు పెను ప్రమాదాల నుంచి తృటిలో తప్పించుకుంటున్నాయి. తాజాగా ఎయిరిండియాకు చెందిన ఎక్స్‌ప్రెస్ విమానం పెను ప్రమాదం నుంచి తప్పించుకుంది. విశాఖ నుంచి మధ్యాహ్నం 2.20 గంటలకు విమానం హైదరాబాద్‌కు బయలు దేరింది. టేకాఫ్ అయిన కొంత సమయానికే విమాన రెక్కలలో ఓ పక్షి ఇరుక్కుపోయింది. పక్షి ఇరుక్కోవడంతో విమాన ఇంజిన్ ఫ్యాన్ రెక్కలు దెబ్బ తిన్నాయి. ఇది గమనించిన పైలట్ చాకచక్యంగా విమానాన్ని వెనక్కి తీసుకొచ్చి ల్యాండ్ చేశారు. దీంతో విమానం పెను ప్రమాదం తప్పింది. ఘటన జరిగిన సమయంలో విమానంలో మొత్తం 103 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులకు ఎయిరిండియా యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి గమ్యస్థానానికి చేరుస్తుంది.

# యూఏఈపై పాక్ ఘన విజయం

## •గ్రూపు-ఏ నుంచి సూపర్-4కి చేరిన రెండో జట్టు



ఆసియా కప్ సూపర్-4లోకి పాకిస్తాన్ దూసుకెళ్లింది. బుధవారం ఆతిథ్య యూఏఈతో జరిగిన మ్యాచ్ లో 41 పరుగులతో ఘన విజయం సాధించింది. మ్యాచ్ ను బాయ్ కాట్ చేస్తామంటూ పలు హెచ్చరికల మధ్య కాస్త లేట్ గా ఈ మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన పాక్.. షరమాములుగానే బ్యాటింగ్ వైఫల్యం కనిపించింది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 146 పరుగులు చేసింది. వన్ డౌన్ బ్యాటర్ ఫఖార్ జమాన్ సూపర్బ్ ఫిఫ్టీ (36 బంతుల్లో 50, 2 ఫోర్లు, 3 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో జునైద్ సిద్దిఖీ నాలుగు వికెట్లతో పాక్ బ్యాటింగ్ ను వణికించాడు. అనంతరం ఛేజింగ్ లో 17.4 ఓవర్లలోనే 105 పరుగులకు యూఏఈ ఆలౌటైంది. వికెట్ కీపర్ బ్యాటర్ రాహుల్ చోప్రా (35) టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో షాషిన్ షా అఫ్రిదీ, హరీస్ రౌఫ్, అబ్రార్ అహ్మద్ లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఈ విజయంతో గ్రూపులో రెండేసి విజయాలతో భారత్ తోపాటు పాక్ కూడా సూపర్-4కు చేరుకుంది. ఒమన్ ఇప్పటికే నాకౌట్ అవగా, తాజాగా యూఏఈ కూడా ఇంటిముఖం పట్టింది. దీంతో గ్రూప్-ఏ నుంచి సూపర్-4కి చేరే జట్లు ఖరరవగా, గురువారం ఆఫ్గానిస్తాన్, శ్రీలంక జట్ల మధ్య జరిగే మ్యాచ్ తో గ్రూప్-బిలో సూపర్-4కు చేరే జట్లపై స్పష్టత వస్తుంది. బౌలింగ్ కు అనుకూలమైన పిచ్ పై టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ కు దిగిన పాక్ కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగలింది. టోర్నీలో వరుసగా మూడో మ్యాచ్ లోనూ ఓపెనర్ సయూమ్ అయూబ్ డకౌటయ్యాడు. మరో ఓపెనర్ షాహిబ్ జాదా ఫర్హాన్ (5) కూడా తర్వగా పెవిలియన్ కు చేరాడు. ఈ దశలో ఫఖార్, కెప్టెన్ సల్మాన్ ఆఘా (20) తో కలిసి ఇన్నింగ్స్ ను నిర్మించాడు. దూకుడుగా ఆడిన జమాన్.. 35 బంతుల్లోనే ఫిఫ్టీ చేశాడు. అయితే వీరిద్దరూ ఔటయ్యాక పాక్ ఇన్నింగ్స్ గతి తప్పింది. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి, కష్టాల్లో పడింది. చివర్లో మమ్మద్ హరీస్ (18), షాహిన్ అఫ్రిది (29 నాటౌట్) బ్యాట్ ఝుళిపించడంతో పాక్ సవాలు విసరగలిగే స్కోరును సాధించింది. మిగతా బౌలర్లలో సమర్జిత్ సింగ్ మూడు వికెట్లు తీశాడు. పాక్ పై ఇప్పటికే రెండు విజయాలు సాధించిన ఉత్సాహంలో ఉన్న యూఏఈ.. ఛేజింగ్ ను ఆత్మ విశ్వాసంతో ప్రారంభించింది. ఓపెనర్లు అలీషన్ షర్పు (12), కెప్టెన్ మహ్మద్ వసీమ్ (14) మంచి ఆరంభాన్నే ఇచ్చారు. వీరిద్దరూ ఔటయ్యాక, చోప్రాతోపాటు ధ్రువ్ పరాశర్ (20) కాస్త పోరాడారు. అయితే కీలక సమయాల్లో పాక్ బౌలర్లు వికెట్లు తీయడంతో టార్గెట్ కు చాలా దూరంలోనే యూఏఈ ఆగిపోయింది. దీంతో టోర్నీలో రెండో విజయంతో తర్వాత దశకు పాక్ అర్హత సాధించింది.

# ఐసీసీ నెం.1 బౌలర్‌గా నిలిచిన వరుణ్ చక్రవర్తి



భారత ఏస్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ప్రస్తానం ఆసక్తికరంగా సాగింది. నాలుగేళ్ల కిందట యూఏఈలో జరిగిన టీ20 ప్రపంచకప్ 2021 మ్యాచ్ లో పాకిస్థాన్ చేతిలో ఘోర ప్రదర్శన చేసి జట్టు నుంచి ఉద్వాసనకు గురైన వరుణ్.. ఆ తర్వాత మూడేళ్ల పాటు అంతర్జాతీయ క్రికెట్ కు ఆడలేకపోయాడు. అయితే గత ఏడాది నవంబర్ నుంచి అంతర్జాతీయ టీ20ల్లోకి రీ ఎంట్రీ ఇచ్చి సత్తా చాటుతున్నాడు. కేవలం పది నెలల్లోనే ఈ ఫార్మాట్లో నెం.1 స్తానాన్ని దక్కించుకున్నాడు. తాజా ఐసీసీ టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్ లో తను నెంబర్ వన్ పొజిషన్ కు చేరుకున్నాడు. దీంతో ఈ ఘనత సాధించి మూడో భారత బౌలర్ గా రికార్డులకెక్కాడు. గతంలో స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రా, లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ మాత్రమే ఈ శిఖర స్తానాన్ని చేరుకుని, చరిత్ర సృష్టించారు. తాజాగా ఆ జాబితాలోకి వరుణ్ చేరుకోవడం పట్ల భారత అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు.నిజానికి 2021 ప్రపంచకప్ లో తొలిసారి పాక్ చేతిలో ఇండియా ఓడిపోయింది. ఆ మ్యాచ్ లో ఏకంగా పది వికెట్ల తేడాతో ఇండియా పరాజయం పాలై, ఆ తర్వాత ఏకంగా టోర్నీ నుంచే లీగ్ దశలో నిష్క్రమించింది. ఇక ఈ మ్యాచ్ లో బౌలింగ్ చేసిన వరుణ్ పై చాలా విమర్శలు వచ్చాయి. మిస్టరీ స్పిన్నర్ గా బరిలోకి దిగిన వరుణ్ ను పాక్ ప్లేయర్లు అలవోకగా ఎదుర్కొన్నారు. దీంతో తన కంటే తమ గల్లీ బౌలర్లు బాగా బౌలింగ్ చేస్తారని, తను మిస్టరీ స్పిన్నర్ అనడం జోక్ గా ఉందని పలువురు పాక్ మాజీ లు వేళాకోళం చేశారు. అయితే అప్పటి అవమానం నుంచి బౌన్స్ బ్యాక్ అయిన వరుణ్.. సైలెంట్ గా సత్తా చాటాడు. గతేడాది నవంబర్ లో సౌతాఫ్రికాతో జరిగిన సిరీస్ లో వరుణ్ ఆకట్టుకున్నాడు. అద్భుతమైన ఆటతీరుతో ఆ సిరీస్ లో మెరిశాడు. ఆ తర్వాత ఇంగ్లాండ్ తో జరిగిన టీ20ల్లోనూ సత్తా చాటాడు. ఫైవ్ వికెట్ హాల్ ప్రదర్శన తోనూ తన సత్తా చాటాడు. ఆ తర్వాత ఏకంగా వన్డే జట్టులోకి వచ్చి, ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ సాధించిన భారత జట్టులో సభ్యునిగా కీలకంగా మారాడు. ఈ క్రమంలో టీ20, వన్డే జట్టులో తన స్తానాన్ని పదిలం చేసుకున్నాడు. తాజాగా యూఏఈలోనే జరుగుతున్న ఆసియా కప్ లో తొలి రెండు మ్యాచ్ ల్లో రెండు వికెట్లు తీసి, నెం.1 బౌలర్ హోదాను దక్కించుకున్నాడు. నాడు యూఏఈలో హ్యూమిలేషన్ కు గురైన వరుణ్.. తాజాగా అదే గడ్డపై అటు చాంపియన్స్ ట్రోఫీ, ఇటు నెం.1 బౌలర్ కిరీటాలను ధరించాడు. రాబోయే రోజుల్లో టీమిండియా ఆడే మూడు ఫార్మాట్లలోనూ తను సభ్యునిగా కావాలని భారత అభిమానులు కోరుకుంటున్నారు.

# ఐపీఎల్ జట్లు కూడా పాకిస్థాన్‌ను ఓడించగలవు

## మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ సంచలన వ్యాఖ్యలు

ఆసియా కప్ 2025లో భాగంగా భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టీమిండియా సాధించిన అద్భుతమైన విజయం అనంతరం పాక్ జట్టుపై విమర్శల పరంపర కొనసాగుతోంది. ఈ క్రమంలో భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ సంచలన వ్యాఖ్యలు చేస్తూ పాకిస్థాన్ జట్టును తీవ్రంగా ఏకిపారేశారు. ఈ వ్యాఖ్యలు తరచూ భారత జట్టుపై విమర్శలు చేసే షాహిద్ అఫ్రిదికి గట్టి సమాధానం ఇచ్చినట్లుగా తెలుస్తోంది.ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఇర్ఫాన్ పఠాన్ పాకిస్థాన్ జట్టు బలహీనతను ఎత్తి చూపారు. భారతదేశంలో ఉన్న చాలా డొమెస్టిక్ జట్లు.. ఉదాహరణకు ముంబై, పంజాబ్ వంటి జట్లు కూడా పాకిస్థాన్ జట్టును ఓడించగలవని ఆయన అన్నారు. అంతే కాకుండా చాలా ఐపీఎల్ జట్లు కూడా పాకిస్థాన్ ను ఈజీగా ఓడించగలవని పేర్కొన్నారు. ఈ కామెంట్స్‌తో పాకిస్థాన్ జట్టు అంతర్జాతీయ స్థాయిలో పోటీపడడానికి ఇంకా చాలా మెరుగుపడాల్సిన అవసంరం ఉందని ఇర్ఫాన్ పఠాన్ సూచించారు.దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత బౌలర్లు అద్భుతంగా రాణించి పాకిస్థాన్ జట్టును కేవలం 127 పరుగులకే కట్టడి చేశారు.



పాకిస్థాన్ బ్యాటింగ్ లైనప్‌లో షాహీన్ అఫ్రిది మినహా ఎవరూ పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. అనంతరం భారత బ్యాటర్లు లక్ష్యాన్ని కేవలం 15.5 ఓవర్లలోనే ఛేదించి విజయఢంకా మోగించారు. అభిషేక్ శర్మ తొలి రెండు బంతుల్లోనే 10 పరుగులు చేసి మ్యాచ్ పై తమ పట్టును చూపించారు. ఈ గెలుపు భారత్ ఆత్మవిశ్వాసాన్ని పెంచగా.. పాకిస్థాన్ జట్టు తమ ఆటతీరుపై ఆలోచించుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది.

# గ్రూప్-బీలో సూపర్-4కు చేరేదెవరో..?



ఆసియా కప్ 2025లో లీగ్ దశ ముగింపుకు చేరుకోవడంతో గ్రూప్-బీలోని మూడు జట్ల మధ్య సూపర్-4 క్వాలిఫికేషన్ కోసం తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే గ్రూప్-ఏ నుంచి భారత్, పాకిస్థాన్ ఇప్పటికే తమ స్థానాలను పదిలం చేసుకున్నాయి. గ్రూప్-బీలో మాత్రం సూపర్-4 క్వాలిఫికేషన్ జట్ల గురించి ఇంకా స్పష్టత రాలేదు. బంగ్లాదేశ్, శ్రీలంక, అఫ్గానిస్తాన్ జట్ల మధ్య జరుగుతున్న ఈ రేసులో ప్రతి బంతి, ప్రతి పరుగు ఎంతో కీలకమైనది. నేడు శ్రీలంక, అఫ్గానిస్తాన్ మధ్య జరుగునున్న మ్యాచ్‌తో గ్రూప్-బీలో అర్హత సాధించే జట్ల భవితవ్యం నిర్ణయం కానుంది. గ్రూప్-బీలో మూడు జట్లలో ఒక్కొక్కరికి వారి అర్హత అవకాశాలు వేర్వేరుగా ఉన్నాయి. బంగ్లాదేశ్ తమ అన్ని లీగ్ మ్యాచ్‌లను పూర్తి చేసింది. ఇప్పుడు వారి భవితవ్యం శ్రీలంక, అఫ్గానిస్తాన్ జట్ల మధ్య నేడు జరగబోయే మ్యాచ్ ఫలితంపై ఆధారపడి ఉంది. బంగ్లాదేశ్ తన లీగ్ మ్యాచ్‌లన్నీ పూర్తి చేసుకుని తమ భవితవ్యం కోసం ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడుతోంది. శ్రీలంక గనుక అఫ్గానిస్తాన్‌ను ఓడిస్తే బంగ్లాదేశ్ సూపర్-4లోకి వెళ్తుంది. కానీ అఫ్గానిస్తాన్ గెలిస్తే బంగ్లాదేశ్ టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. అందుకే బంగ్లాదేశ్ అభిమానులు శ్రీలంక విజయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. అఫ్గానిస్తాన్ గనుక శ్రీలంకను 70 లేదా అంతకంటే ఎక్కువ పరుగుల తేడాతో ఓడిస్తే, బంగ్లాదేశ్ నెట్ రన్ రేట్ శ్రీలంక కంటే మెరుగ్గా ఉంటుంది. ఈ పరిస్థితిలో బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ రెండూ క్వాలిఫై అవుతాయి.అఫ్గానిస్తాన్ క్వాలిఫికేషన్ సమీకరణం చాలా సులభంగా ఉంది. కానీ వారికి ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. అఫ్గానిస్తాన్ శ్రీలంకను ఏ తేడాతో ఓడించినా, వారి నెట్ రన్ రేట్ బంగ్లాదేశ్ కంటే మెరుగ్గా ఉన్నందున శ్రీలంకతో కలిసి సూపర్-4లో అడుగుపెడుతుంది 70 లేదా అంతకంటే ఎక్కువ పరుగుల తేడాతో గెలిచినా, లేదా లక్ష్యాన్ని 50 లేదా అంతకంటే ఎక్కువ బంతులు మిగిలి ఉండగానే ఛేదించినా, అఫ్గానిస్తాన్ బంగ్లాదేశ్‌తో కలిసి అర్హత సాధిస్తుంది.ఈ టోర్నీలో శ్రీలంక ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. వారి క్వాలిఫికేషన్ అవకాశాలు మెరుగ్గా ఉన్నప్పటికీ, వారు జాగ్రత్తగా ఉండాలి. శ్రీలంక అఫ్గానిస్తాన్‌ను ఏ తేడాతో ఓడించినా, వారు గ్రూప్ టాపర్‌గా నిలిచి బంగ్లాదేశ్‌తో కలిసి సూపర్-4కు వెళ్తారు. ఒకవేళ శ్రీలంక ఓడిపోయినా, ఓటమి తేడా 70 పరుగుల కంటే తక్కువగా ఉండాలి. అలా జరిగితే, బంగ్లాదేశ్ టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది, శ్రీలంక, అఫ్గానిస్తాన్ క్వాలిఫై అవుతాయి.అఫ్గానిస్తాన్ లక్ష్యాన్ని ఛేదిస్తున్నప్పుడు, శ్రీలంక వారు 12.2 ఓవర్లలోపు (అంటే 46 బంతులు మిగిలి ఉండగానే) లక్ష్యాన్ని పూర్తి చేయకుండా జాగ్రత్త పడాలి. అలా జరిగితే శ్రీలంక నెట్ రన్ రేట్ దెబ్బతిని క్వాలిఫికేషన్ కష్టం అవుతుంది.

# భారత్‌కు మా క్రికెట్‌ను కూల్చే శక్తి ఉంది

## పీసీబీ మాజీ చైర్మన్ రమీజ్ రాజా

ఆసియా కప్ 2025లో భాగంగా పాకిస్థాన్, భారత్ మధ్య జరిగిన మ్యాచ్ తర్వాత షేక్ హ్యాండ్ ఇవ్వకపోవడంపై జరిగిన వివాదం అనంతరం మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను తొలగించాలని పీసీబీ చేసిన డిమాండ్ పాక్ క్రికెట్లో పెద్ద దుమారాన్నే రేపుతోంది. ఈ వివాదంపై పీసీబీ మాజీ ఛైర్మన్ రమీజ్ రాజా కూడా స్పందించి బీసీసీఐపై ఆరోపణలు చేశారు. అయితే ఆయనే గతంలో భారత్ గురించి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(%ూజదీ%) ఛైర్మన్ గా ఉన్న సమయంలో రమీజ్ రాజా భారత్‌ను ప్రశంసించారు. 2021లో రమీజ్ రాజా మాట్లాడుతూ.. "ఐసీసీ ఒక రాజకీయ సంస్థ. ఐసీసీ ఆదాయంలో 90 శాతం భారత్ నుంచే వస్తుంది. పీసీబీకి వచ్చే నిధుల్లో 50 శాతం ఐసీసీ నుంచే వస్తుంది. భారత్‌లోని వ్యాపార సంస్థలే పాకిస్థాన్ క్రికెట్‌ను నడుపుతున్నాయి. రేపు భారత ప్రధాని ఒక నిర్ణయం తీసుకుని పాకిస్థాన్‌కు ఎటువంటి నిధులు ఇవ్వకుండా ఆపేస్తే, ఈ క్రికెట్ బోర్డు కుప్పకూలిపోతుంది" అని రమీజ్ రాజా చెప్పారు అయితే ఇప్పుడు అదే రమీజ్ రాజా బీసీసీఐని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారు. భారత్-పాక్ మ్యాచ్ అనంతరం జరిగిన వివాదానికి పైక్రాఫ్ట్ కారణమని ఆరోపించారు. మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను తొలగించాలనే పీసీబీ డిమాండ్ ను ఐసీసీ పట్టించుకోలేదు. ఈ క్రమంలో పాకిస్థాన్ జట్టు యూఏ ఈతో మ్యాచ్ ఆడి, కష్టపడి గెలిచి సూపర్-4కు చేరింది. ఈ విజయంతో సెప్టెంబర్ 21 దుబాయ్‌లో మళ్లీ భారత్‌తో తలపడ నుంది. ఓ వైపు మ్యాచ్‌లకు ముందు వివాదాలు.. మరోవైపు పాక్ జట్టు ఆటతీరుపై ప్రశ్నలు ఉన్నప్పటికీ.. ఈ మొత్తం డ్రామా చివరకు ఇరు జట్ల మధ్య మరో రసవత్తరమైన పోరుకు దారి తీసింది.



## ఫామ్ కోల్పోయి ఇబ్బందులు పడుతున్న

# శ్రేయాస్ అయ్యర్

టీమిండియాలో తిరిగి స్థానం సంపాదించుకోవడానికి ప్రయత్నిస్తున్న బ్యాట్స్‌మెన్ శ్రేయాస్ అయ్యర్ ఫామ్ కోల్పోయి కష్టాలు పడుతున్నాడు. లక్నోలో ఆస్ట్రేలియా-ఎతో జరిగిన మొదటి అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో ఇండియా-ఎ కెప్టెన్ అయిన శ్రేయాస్ అయ్యర్ మళ్లీ జట్టును నిరాశపరిచాడు. ఆస్ట్రేలియా స్పిన్నర్ కోరీ రోచిచియోలీ బౌలింగ్‌లో కేవలం 13 బంతుల్లోనే 8 పరుగులు చేసి అవుటయ్యాడు. ఈ మ్యాచ్‌కు ముందు కూడా దులీప్ ట్రోఫీలో అతను పెద్దగా రాణించలేకపోయాడు.శ్రేయాస్ అయ్యర్ గత మూడు ఇన్నింగ్స్‌లలో పెద్దగా స్కోర్ చేయలేకపోయాడు. దులీప్ ట్రోఫీ 2025లో సెంట్రల్ జోన్‌పై వెస్ట్ జోన్ తరపున ఆడుతూ, మొదటి ఇన్నింగ్స్‌లో 25 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 12 పరుగులు మాత్రమే చేసి అవుటయ్యాడు. ఈ నిరాశాజనకమైన ఫామ్ ఆస్ట్రేలియా-ఎతో మ్యాచ్‌లోనూ కొనసాగింది. ఇది అతని టీమిండియాలో స్థానంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. అయ్యర్ విఫలమైనప్పటికీ.. ఇండియా-ఎ జట్టులోని నలుగురు బ్యాట్స్‌మెన్లు అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. వారు హాఫ్ సెంచరీ సాధించి జట్టుకు బలమైన పునాది వేశారు. వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ నారాయణ్ జగదీషన్ 113 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్సర్‌తో 64 పరుగులు చేశాడు. ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ 44 పరుగులు చేసి, జట్టుకు మంచి ఆరంభం ఇచ్చాడు. సాయి సుదర్శన్ 124 బంతుల్లో 10 ఫోర్ల సహాయంతో 73 పరుగులు సాధించాడు. దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురేల్ కూడా హాఫ్ సెంచరీలు పూర్తి చేసి క్రీజులో నిలిచారు. ఈ అద్భుతమైన ప్రదర్శనతో ఇండియా-ఎ జట్టు స్కోర్ 400 పరుగుల దగ్గరకు చేరుకుంది. మ్యాచ్ జరిగే సమయానికి, భారత్ 4 వికెట్ల నష్టానికి 383 పరుగులు చేసింది. ఈ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా-ఎ బ్యాట్స్‌మెన్లు ఆధిపత్యం కనబరిచారు. వారు 6 వికెట్ల నష్టానికి 532 పరుగులు చేసి ఇన్నింగ్స్ డిక్లేర్ చేశారు. వారి జట్టులోని ఇద్దరు బ్యాట్స్‌మెన్లు సెంచరీలు సాధించారు. అయినప్పటికీ, ఇండియా-ఎ బ్యాట్స్‌మెన్లు కూడా ధీటుగా బదులిచ్చారు.. కానీ శ్రేయాస్ అయ్యర్ ఫామ్ మాత్రం భారత జట్టుకు ఆందోళన కలిగించే విషయం.





# ఎఎన్నార్ 101 జయంతి స్పెషల్

## ప్రేమాభిషేకం రీ-రిలీజ్ -థియేటర్లలో ఉచితంగా ప్రదర్శన

దివంగత అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతి సందర్భంగా అభిమానులకు ప్రత్యేక బహుమతి సిద్ధమైంది. ఆయన నటించిన సూపర్‌హిట్ క్లాసిక్ చిత్రాలు డాక్టర్ చక్రవర్తి, ప్రేమాభిషేకం మళ్లీ పెద్ద తెరపైకి వస్తున్నాయి. ముఖ్యంగా, ఈ సినిమాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఎంపిక చేసిన థియేటర్లలో అది కూడా ఉచిత టిక్కెట్లతో ప్రదర్శించనున్నారు. ఇది నిజంగా అభిమానుల్లో విశేష ఆనందాన్ని కలిగిస్తోంది.ఈ రెండు ప్రసిద్ధ చిత్రాలు సెప్టెంబర్ 20 నుంచి మళ్లీ రీ-రిలీజ్ అవుతున్నాయి. పెద్ద తెరపై ఏఎన్ఆర్ మాయాజాలాన్ని మళ్లీ ఆస్వాదించే అరుదైన అవకాశం ఇది. ఈ ప్రత్యేక ప్రదర్శనలకు టిక్కెట్లు- బుక్ మై షో లో ఉచిత రిజర్వేషన్ కోసం అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ఒంగోలు వంటి ప్రధాన నగరాల్లోని ప్రముఖ థియేటర్లలో ప్రదర్శనలు జరగనున్నాయి. వీటిలో వైజాగ్‌లో క్రాంతి థియేటర్, ఒంగోలులో స్వర్ణ ప్యాలెస్, విజయవాడలో కృష్ణ టాకీస్, అలాగే హైదరాబాద్‌లోని ఒక ప్రసిద్ధ థియేటర్ కూడా ఉన్నాయి. రాబోయే రోజుల్లో మరిన్ని కేంద్రాలను జోడించే అవకాశం ఉందని సమాచారం. ఏఎన్ఆర్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఆయన నటన, సిల్వర్ స్క్రీన్‌పై సృష్టించిన మాయాజాలాన్ని అభిమానులు మరోసారి ఆస్వాదించనున్నారు. అభిమానులు తమ తమ నగరాల్లోని థియేటర్లకు వెళ్లి, కుటుంబసభ్యులతో కలిసి ఈ క్లాసిక్ సినిమాలను చూసి ఆనందించాలని పిలుపునిచ్చారు.

# ఓజి నుంచి ప్రకాశ్ రాజ్ పోస్టర్ విడుదల

పవన్ కల్యాణ్ హీరోగా 'ఓజీ' సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా మేకర్స్ ఓ సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఇందులో విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ పాత్రను పరిచయం చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. చిత్రంలో ఆయన 'సత్య దాదా' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో ప్రకాశ్ రాజ్ సీరియస్ లుక్‌లో కనిపించారు. పోస్టర్ ఆధారంగా ఆయన పాత్ర కీలకమని అర్థమవుతోంది. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌గా 'ఓజీ' రూపొందుతోంది. ఇందులో పవన్ ఇప్పటి వరకూ ఎన్నడూ చూడని పాత్రలో ఓజాస్ గంభీర అనే గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. ఆయన సరసన ప్రియాంకా మోహన్ నటించారు. ఇమ్రాన్ హష్మీ విలన్. శ్రియారెడ్డి, అర్జున్‌దాస్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుతం దీని పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.




# హాట్ అందాలతో మెస్మరైజ్ చేస్తున్న రెజీనా..



రెజీనా కసాండ్రా.. తమిళనాడు హీరోయిన్ అయినప్పటికీ తెలుగు సినిమాల్లో ఒక ప్రత్యేకమైన ముద్ర వేసుకుంది.. తమిళనాడు చెన్నైలో పుట్టి పెరిగిన ఈ ముద్దుగుమ్మ టాలీవుడ్లోకి శివ మనసులో శృతి అనే సినిమాతో ఎంట్రీ ఇచ్చింది.ఆ తర్వాత రొటీన్ లవ్ స్టోరీ, కొత్తజంట, పిల్లా నువ్వు లేని జీవితం, సుబ్రహ్మణ్యం ఫర్ సేల్ వంటి ఎన్నో హిట్ సినిమాల్లో మెరిసింది. అలా ఈ హీరోయిన్ తెలుగు, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో నటిగా రాణించింది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ తాజాగా తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసిన ఫోటోల ద్వారా హాట్ టాపిక్ గా మారింది. ఆ ఫోటోలు చూసినా చాలామంది నెటిజన్లు "హాట్ గా ఉన్నావు.. చెమటలు పట్టిస్తున్నావు" అంటూ కామెంట్లు పెడుతున్నారు. తాజాగా రెజీనా తన ఇంస్టాగ్రామ్ ఖాతాలో బ్లాక్ కలర్ పార్టీవేర్ డ్రెస్ లో ఉన్న ఫోటోలను షేర్ చేసుకుంది. ఆ ఫోటోలలో రెజీనా కసాండ్రా అచ్చం ప్రిన్సెస్ లాగే మెరిసిపోతుంది. ప్రిన్సెస్ వేసుకునే డ్రెస్ తో పాటు ఆమె హెయిర్ స్టైల్ కూడా అచ్చం ప్రిన్సెస్ మాదిరి లాగే ఉండడంతో అచ్చం దేవకన్యలా, రాజకుమారిలా ఉన్నావు అంటూ చాలామంది నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఈ బ్లాక్ కలర్ డ్రెస్ కి వైట్ కలర్ పూసల చైన్ ని కాంబినేషన్ గా మెడలో ధరించింది రెజీనా.. అలాగే చేతికి కూడా పూసల బ్రేస్లెట్ ని పెట్టుకోవడంతో మరింత లుక్ వచ్చింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఈ ఫోటోలు నెట్టింట వైరల్ గా మారడంతో చాలామంది నెటిజన్స్ హాట్ హాట్ గా కామెంట్లు పెట్టడంతో పాటు హాట్ ఎమోజీలను షేర్ చేస్తున్నారు. ఈ బ్లాక్ డ్రెస్ ఫోటోల కింద రెజీనా "హలో అపరిచితుడు.. మిస్ కసాండ్రా..మీకు వీలైతే" అంటూ క్యాప్షన్ పెట్టింది. ఇక రెజీనా కసాండ్రా సినిమాల విషయానికి వస్తే.. తమిళంలో మూకుత్తి అమ్మన్ -2,కల్లా పార్ట్, అనంతన్ కాదు, పార్టీ,ఫ్లాష్ బ్యాక్, సూర్పనగై వంటి సినిమాల్లో చేస్తోంది. అలాగే తెలుగులో కైవల్య అనే సినిమాలో నటిస్తోంది. ఇకపోతే ఇండస్ట్రీకి వచ్చి రెండు దశాబ్దాలు అవుతున్నా.. ఇప్పటికీ తగ్గని క్రేజ్ తో వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఒకవైపు హీరోయిన్ గా సినిమాలు చేస్తూనే మరొకవైపు క్యారెక్టర్ ఆర్టిస్ట్ పాత్రలతో కూడా ప్రేక్షకులను అలరిస్తున్న ఈమె ఢీ వంటి డాన్స్ షోలకు జడ్జిగా కూడా వ్యవహరిస్తూ అభిమానులకు చేరువ అవుతోంది. మొత్తానికి అయితే వరుస పెట్టి సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న రెజీనా ఇటు సోషల్ మీడియాలో కూడా అందాలు ఒలకబోస్తూ మరింత హాట్ టాపిక్ గా మారిందని చెప్పవచ్చు.

# సెప్టెంబర్ సినిమాలకు కలసి వచ్చింది

## కిష్కింధపురి సక్సెస్ మీట్‌లో అనిల్ రావిపూడి



ఈ సెప్టెంబర్‌లో థియేటర్‌లు కళకళలాడుతున్నాయని అనిల్ రావిపూడి పేర్కొన్నారు. ఇది సక్సెస్‌ఫుల్ సెప్టెంబర్ అన్నారు. వరుస సినిమాలతో పండగ వాతావరణం నెలకొందని.. ఇదే కొనసాగాలని కోరుకుంటున్నానని అన్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కిష్కింధపురి' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. తాజాగా ఆడియన్స్‌కు ధన్యవాదాలు చెబుతూ టీమ్ హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ ఈవెంట్‌కు దర్శకుడు అనిల్ రావిపూడి, బాబీ, అనుదీప్, వశిష్ఠలతో పాటు- హీరో సాయి దుర్గా తేజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హారర్ సినిమాలు ఎలా ఉన్నా అందరూ ఆదరణ సొంతం చేసుకుంటాయని అందరూ అనుకుంటారు. కానీ, వాటిలో కంటెంట్ ఉంటేనే ప్రేక్షకులు ఆదరిస్తారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వాళ్ల నాన్న ఎంత పెద్ద నిర్మాతో అందరికీ తెలిసిందే. అయినా సాయి మాత్రం ఏ సినీ నేపథ్యం లేనట్లు- కష్టపడుతుంటాడు. అనిల్ రావిపూడి- చిరంజీవి కాంబినేషన్‌లో రానున్న సినిమాలో కొన్ని సన్నివేశాలు చూశాను. చాలా బాగున్నాయి. కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుంది. ఈ సినిమాతో విజయాన్ని సొంతం చేసుకున్న నిర్మాత సాహు గారపాటి.. సంక్రాంతికి చిరంజీవి చిత్రంతో మరోసారి మంచి ఫలితాలు చూస్తారని బాబీ నమ్మకంగా చెప్పారు.తెలుగు సినిమాలకు థియేటర్‌లలో జనాలు రావడం లేదని ఈ మధ్య కామెంట్స్ వినిపించాయి. కానీ, సెప్టెంబర్‌ను మాత్రం ఆడియన్స్ సెలబ్రేట్ చేసుకున్నారు. సాయి దుర్గాతేజ్ అంటే నాకు చాలా ఇష్టం. ఒక బ్రదర్‌గా ఆయన ఎప్పుడూ నాకు తోడున్నారని సాయి శ్రీనివాస్ తెలిపారు.

# కుటుంబ గొడవలతో మౌనంగా ఉన్నా

## దక్ష ప్రమోషన్‌లో వెల్లడించిన మంచు లక్ష్మి



ఇంట్లో ఎవరు హిట్ అందుకున్నా.. అది అందరి విజయంగా భావించి ఆనందిస్తానని నటి మంచు లక్ష్మి అన్నారు. తన తండ్రి మోహన్‌బాబుతో కలిసి ఆమె నటించిన యాక్షన్ చిత్రం 'దక్ష' 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రచారంలో ఆమె బిజీగా ఉన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తమ కుటుంబంలో జరిగిన గొడవలపై మాట్లాడారు. మిరాయ్' విజయాన్ని నేను కూడా ఎంజాయ్ చేస్తున్నాను. కుటుంబంలో ఎవరికి సక్సెస్ వచ్చినా మా అందరిదిగా భావించి ఆనందిస్తా. ఒకరి కష్టం వృథా కావాలని ఎప్పుడూ కోరుకోను. జీవిత పాఠాలు నేర్చుకోవాలి అనుకుంటాను.. కానీ, కష్టానికి ప్రతిఫలం రాకుండా ఉండాలని ఎప్పుడూ కోరుకోను. ఎందుకంటే ఈ రంగంలో ఎన్ని ఇబ్బందులు ఉంటాయో నాకు తెలుసు. ఒక ఆర్టిస్ట్‌గా వాళ్లకు సలహాలు ఇస్తాను. 'మిరాయ్' సక్సెస్‌ను ఎంజాయ్ చేయమని మొన్న కలిసినప్పుడు కూడా మనోజ్‌కు చెప్పానని అన్నారు. ఒక కుటుంబంలో ఏదైనా సమస్య వచ్చినప్పుడు అందరూ నలిగిపోతారు. అలా జరగదు అని చెప్పడం అబద్ధం. కానీ, మేము ఉండేది అద్దాల మేడలో.. ఏం చెప్పినా తల, తోక కట్ చేసి వాళ్లకు నచ్చినట్లు- రాసుకునే రోజులివి. అలాంటప్పుడు సైలెంట్‌గా ఉండడమే ఉత్తమం అని నాకు అనిపించింది. అందుకే మౌనంగా ఉన్నాను. గతంలో ఏది ఒప్పు, ఏది తప్పు అని ఆలోచించేదాన్ని. ఇప్పుడు అలా ఆలోచించడం లేదు. దీని వల్ల నేను ఆనందంగా ఉంటానా, బాధపడతానా అని ఆలోచిస్తున్నాను. జీవితంలో ఏదైనా మనకు ఒక పాఠం నేర్పడానికే వస్తుంది. ఏది జరిగినా మౌనంగా ఆలోచిస్తే ప్రశాంతత లభిస్తుందని మంచు లక్ష్మి చెప్పారు.



# కిస్ మూవీ ట్రైలర్ విడుదల

తమిళ నటుడు కవిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'కిస్'. 'దాదా' సినిమాతో మంచి హిట్ అందుకున్న కవిన్.. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రంలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ప్రముఖ కొరియోగ్రాఫర్ సతీష్ కృష్ణన్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతుండగా.. రోమియో పిక్చర్స్ బ్యానర్‌పై రాహుల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా, సినిమా నుంచి తాజాగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులో కవిన్.. ప్రేమ, ముద్దు అంటే అస్సలు ఇష్టపడని యువకుడి పాత్రలో కనిపిస్తున్నారు.

గతంలో జరిగిన సంఘటనల కారణంగా ప్రేమపై నెగిటివ్ భావాలు ఏర్పడిన అతడి జీవితంలోకి 'ప్రీతి' అనే అమ్మాయి ప్రవేశించిన తర్వాత ఎలాంటి మార్పులు జరిగాయి? అన్నదే ఈ సినిమా ప్రధాన కథాంశం.ఈ చిత్రం తెలుగు, తమిళంతో పాటు- హిందీ భాషల్లో కూడా విడుదల కానుంది.

# కల్కి-2 నుంచి తప్పకున్న దీపిక



ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కల్కి 2898 ఏడీ' పార్ట్-2 నుంచి దీపక తప్పుకున్నారు. గతేడాది విడుదలైన ఈ చిత్రం భారతీయ సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చి ఎన్నో అవార్డులను సొంతం చేసుకుంది. దీనికి సీక్వెల్ ఉన్నట్లు- ఇప్పటికే చిత్రబృందం వెల్లడించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ మూవీ టీమ్ సడెన్ షాక్ ఇచ్చింది. దీని సీక్వెల్‌లో దీపికా పదుకొణె నటించడం లేదని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టింది. 'కల్కి' సీక్వెల్‌లో దీపిక భాగం కాదని అధికారికంగా తెలియజేస్తున్నాం. తొలి భాగం కోసం ఆమెతో సుదీర్ఘ ప్రయాణం చేసినప్పటికీ రెండో పార్ట్‌లో భాగస్వామి కాలేకపోయింది. గొప్ప టీమ్‌తో కల్కి సీక్వెల్ మీ ముందుకు వస్తుంది. భవిష్యత్తులో దీపిక మంచి సినిమాలతో అలరించాలని కోరుకుంటున్నాం అని వైజయంతీ మూవీస్ పోస్ట్ పెట్టింది. నిర్మాణ సంస్థ ప్రకటనతో అభిమానులు షాక్ అవుతున్నారు. గత కొన్ని రోజులుగా దీపికా పేరు నిత్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్న విషయం తెలిసిందే. ఇటీ-వల ఆమె ఓ భారీ ప్రాజెక్ట్ నుంచి వైదొలగినట్లు- కూడా వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఈ భారీ అప్‌కమింగ్ సినిమా నుంచి ఆమె వైదొలగడం చర్చనీయాంశంగా మారింది.